విశాఖపట్టణం
ఆదివారం 2 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:190 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అంతా స్వాగతించాలి

చంద్రబాబు క్రెడిట్ చోరీ ప్రయత్నం కొత్తమీ కాదు

జగన్ శ్రమ, ప్రయత్నాలు అందిరికీ తెలుసు

వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డి వ్యాఖ్యలు



(తాడేపల్లి - జయజయహే)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో అసలు శ్రమ అంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని, కూటమి ప్రభుత్వం కేవలం పక్క దారిలో క్రెడిట్ కొట్టేసేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుడు సజ్జల రామకృష్ణా రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ..మిగతా 2లో

# వైభోగమా.. వైభాగ్యమా.. భోగాపురం!




## ఎయిర్ పోర్టుకు ఒకే కుటుంబం పేర్లు

విప్లవాత్మక శక్తి భోగాపురం ఎయిర్ పోర్టు

ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మార్చేస్తుంది

ఉత్తరాంధ్ర వికాసానికి రన్ వే

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

(భోగాపురం - జయజయహే)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా జాతికి అంకితం చేశారు. దీనితో పాటు రాష్ట్ర సమగ్ర పురోగతికి ఊతమిచ్చే రూ.18,000 కోట్ల విలువైన వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. భారీ బహిరంగ సభలో ప్రధాని అందరికీ ..మిగతా 2లో




పోలీసు ఆంక్షలు... కేసులు... ముళ్ల బాట...అయినా వీడని జనం ఒకరి సొత్తు

ఏపీ బస్సులు... టీలు.. టిఫిన్లు.... రాజభోగాలు... ప్రభుత్వ పదవులు... కూటమి పొత్తు

ప్రధాని...సీఎం...పవన్...ప్రభుత్వ యంత్రాంగమంతా ఓ ఎత్తు

జనాల తరలింపులో ఎవరిది నిజాయితీ

## కూటమి కుతంత్రమా...జగన్ ప్రభం 'జనమా'





(ఎంకే సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో )

భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అతిరథ మహారధులంతా హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. దీంతో ఉత్తరాంధ్రకు వైభాగ్యం...వైభోగం అంటూ తెగ పొగిడేశారు. ఉత్తరాంధ్ర దిశ..దశ మార్చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకున్నారు. అయితే వైసీపీ మాత్రం క్రెడిట్ చోరీ అంటూ చంద్రబాబుపై దుమ్మెత్తి పోస్తోంది. తమ హయాంలోనే రూ. వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడి పెట్టి ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని పట్టాలెక్కించామని ఆ పార్టీ నేతలు గట్టిగానే చెబుతుంటే మరో పక్క సీఎం చంద్రబాబు మాత్రం కొబ్బరి కాయ కొట్టింది మేమే...గుమ్మడి కాయ కట్టింది మేమే అంటూ నిండు సభలో పేర్కొన్నారు. టీడీపీ వైసీపీల రాజకీయ ప్రకంపనల సంగతి కాసేపు అలా ఉంచితే.... ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి కూటమి ప్రభుత్వం భారీ ఎత్తున జన సమీకరణ చేశారు. ఎంతలా అంటే....విశాఖలో తాగు నీటి కుళాయిల ద్వారా చుక్క నీరు రాకుండా చేసి మరీ... జ నాలను తరలించారంటే ఈ ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలు ..మిగతా 2లో

## ఎర్రబస్సు రాదన్నారు.. ఎయిర్ బస్సు వచ్చింది

ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ... అర్థమైందా రాజా



2

మోదీజీ వికసిత్ భారత్... సీబీఎన్ విజన్‌కు ప్రతిరూపం భోగాపురం ఎయిర్ పోర్ట్

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గ్రోత్ ఇంజన్ ఉత్తరాంధ్ర

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో మంత్రి లోకేష్

## మోదీని తిడితే కన్నీళ్లు వచ్చాయి

దేశం కోసం ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు

దేశం కోసం కష్టపడే వాళ్లకు ఇచ్చే గౌరవం ఇదేనా

పిల్లల్ని సరైన మార్గంలో పెంచాలి

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(భోగాపురం - జయజయహే)




ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఈ వేదికగా ఏపీ ఉ ప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా ..మిగతా 2లో

## ఇక తీపి జ్ఞాపకంగా విశాఖ ఎయిర్‌పోర్టు

16 అర్ధరాత్రి నుంచే రక్షణ శాఖ పరిధిలోకి

(విశాఖపట్నం - జయజయహే)




దాదాపు ఐదారు దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖ విమానాశ్రయం సాధారణ పౌర విమాన సేవలను నిలిపివేయనుంది. ఆగస్టు 16 అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ మూతపడనుంది. చివరి పౌర విమానం ఆ రోజు అర్ధరాత్రి ఎగరటంతో, ఈ చారిత్రాత్మకమైన ఎయిర్‌పోర్ట్ చరిత్ర పుటల్లో కలవనుంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ ..మిగతా 2లో




## ఉద్యోగుల శంఖారావం..!

ప్రభుత్వంపై పోరు బాట

కలెక్టరేట్ల ముట్టడి.. సచివాలయాల్లో నిరసనలు

ఎన్జీఓ హోం లో ఉద్యోగుల జేఏసీ కార్యాచరణ

(అమరావతి - జయజయహే)

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం దిశగా జేఏసీ మరోసారి పోరుబాట పట్టింది. బకాయిలు పడిపోయిన ఆర్థిక లబ్ధులు, నిలిచిపోయిన డీఏలు మరియు నూతన వేతన సవరణ సంఘం నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ఏపీ జేఏసీ డిమాండ్ చేసింది. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో జేఏసీ నేతలు సుమారు మూడేళ్లుగా ఉద్యోగ వర్గాలు తీవ్ర ఆర్థిక ఇబ్బం దులను ఎదుర్కొంట ున్నాయని, ప్రభుత్వ ప్రకటనలు తప్ప ..మిగతా 2లో

## గనుల శాఖపై రాబందులు

బలి పశువులుగా మారుతున్న అధికారులు

పంచదార్ల మైనింగ్‌తో కూటమికి అప్రతిష్ఠ

దిద్దుబాటు చర్యలు చేపట్టిన ప్రభుత్వం

మైన్స్ ఏడీ సస్పెన్షన్....మరి కొందరిపై వేటు

సూత్రధారులు మాత్రం సేఫ్...



(అనకాపల్లి, జయ జయహే ప్రత్యేక ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో గనుల శాఖ పై రాజకీయ రాబందులు వాలిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో గనుల శాఖ లో అవినీతి పెరిగిపోయిందని గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక అవినీతి తారాస్థాయికి చేరుకుంది. ఎంతలా అంటే అనుమతులతో సంబంధం లేదు. దోచుకున్నోడికి దోచుకున్నంత రీతిలో చెలరేగిపోతున్నారు. అనకాపల్లి జిల్లా వరకూ వస్తే సుమారు 400 వరకూ క్వారీ, క్రషర్లు ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలో అక్రమ మైనింగ్ జోరు ప్రభుత్వానికి ఆదాయం సమకూరకపోగా అప్రదిష్ట పాలైంది. జిల్లాలోని రాంబిల్లి మండలంలో ప్రసిద్ది చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రం ఉంది. నిత్యం ఐదు దారలు దశాబ్దాల కాలంగా ప్రవహిస్తున్నాయి. భక్తులు ఈ దారల కింద స్నానమాచరించి దైవ దర్శనం ..మిగతా 3లో



## తెలుగు రాష్ట్రాల మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే

మరో వారం రోజుల్లో ప్రారంభం

ఎన్ హెచ్ 365గా నామకరణం

3

## గోదావరి ఉగ్రరూపం

13 అడుగులకు చేరిన నీటి మట్టం

పెరుగుతున్న వరద ఉధృతి

భయం గుప్పిట్లో లంక గ్రామాల ప్రజలు

ఇప్పటికే నీట మునిగిన లంక గ్రామాలు

అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

3

# ఎయిర్ పోర్టుకు ఒకే కుటుంబం పేర్లు










నమస్కారం అని తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. సింహాచలం అప్పన్న స్వామికి, విజయనగరం పైడితల్లి అమ్మవారికి శిరస్సు వంచి ప్రణామాలు సమర్పించారు. ఏపీ ప్రగతిలో ఒక శుభదినమని, రూ.18,000 కోట్ల ప్రాజెక్టులు రాష్ట్ర రూపురేఖలను వేగంగా మారుస్తాయని ధీమా వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కేవలం విమానాల రాకపోకలకే పరిమితం కాదని, ఇది ఉత్తరాంధ్ర వికాసానికి కొత్త రన్‌వేగా, ఆంధ్రా యువత కలలకు లాంచ్‌పాడ్‌లా ఉపయోగపడుతుందని కొనియాడారు. గతంలో విమానాశ్రయం నిర్మిస్తే ఒకే కుటుంబం పేర్లు పెట్టే సంస్కృతి ఉండేదని.. కానీ తమ ప్రభుత్వం అయోధ్యలో మహర్షి వాల్మీకి, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేర్లు పెట్టినట్లే, ఇక్కడ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో గౌరవించుకున్నామని మోదీ గుర్తుచేశారు. 2014 నాటికి దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవి. కానీ గడిచిన 12 ఏళ్లలో కొత్తగా 166 విమానాశ్రయాలను నిర్మించి మొత్తం సంఖ్యను భారీగా పెంచామన్నారు. ఉడాన్ పథకం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూడా తమ సొంత ప్రాంతాల నుంచే విమానం ఎక్కేలా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు ఉన్న పాత రేవులను ఆధునీకరించడంతో పాటు, మూలపేట, రామాయపట్నంలో నూతన పోర్టులు నిర్మిస్తున్నామని ప్రధాని మోదీ చెప్పారు. ఏపీలో ప్రస్తుతం రూ. లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు నడుస్తున్నాయని వివరించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతోందని, గ్లోబల్ ఇన్వెస్టర్లు తరలివస్తున్నారని పేర్కొన్నారు.

### ఇక తీపి జ్ఞాపకంగా
## విశాఖ ఎయిర్‌పోర్టు

మొదటి పేజీ తరువాయి...

మార్పు అనివార్యం.ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేస్తారు. ఆ తర్వాత మంచి ముహూర్తం చూసుకుని శ్రావణ మాసంలో ఆగస్టు 17 నుంచి భోగాపురంలో విమానయాన కార్యకలాపాలు ప్రారంభమవుతాయి. ఆగస్టు 17న రాత్రి 12 గంటల ఒక నిమిషం నుంచి దాదాపు 30 సంవత్సరాల పాటు విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు కేంద్రం గెజిట్ విడుదల చేసింది. విశాఖకు సొంతమైన వీటీజెడ్ కోడ్ కూడా భోగాపురం ఎయిర్‌పోర్టుకే బదిలీ అవుతుంది.అయితే, పాత విశాఖ ఎయిర్‌పోర్ట్ పూర్తిగా మూతపడదు. వీఐపీ, అత్యవసర సేవలు, జాతీయ అత్యవసర పరిస్థితులు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, నేవీ, డిఫెన్స్ ఫోర్సెస్, పోలీస్ విమానాలు, ప్రైవేట్ జెట్‌లు, లీజ్డ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచే ఆపరేట్ అవుతాయి.

## మోదీని తిడితే కన్నీళ్లు వచ్చాయి

మొదటి పేజీ తరువాయి...

మారాయి. ఎయిర్ పోర్ట్ ఓపెనింగ్ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆకాశానికెత్తారు. ఇటీవల జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాను ప్రస్తావిస్తూ.. మోదీని మాటలు అంటుంటే తనకు కన్నీళ్లు వచ్చాయని పవన్ పేర్కొన్నారు.

**సెలవు లేకుండా**

"ప్రధాన మంత్రిని చాలా మంది అనకూడని మాటలు అంటుంటే నాకు కన్నీళ్లు వచ్చాయి. దేశం కోసం కష్టపడేవాళ్లకు ఇదా చివరకు మనం ఇచ్చేది? ఆయన పడ్డ కష్టం ఎవరికి తెలుసు? ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. మన దేశ అభివృద్ధి కోసం బయట శత్రువులతో, లోపలి శత్రువులతో పోరాడుతున్నారు" అని పవన్ కళ్యాణ్ ప్రసంగించారు.

**పిల్లలను సరైన దారిలో**

"మేం ఉన్నాం మీ వెంట. మీ మీద మాట పడితే మా మీద పడ్డట్లే అని ప్రధాని వెంటే ఉండాలి. జంతర్ మంతర్ దగ్గర ఆయన్ని ఎన్నో మాటలు అన్నారు. కానీ నేను చెప్తున్నా మోదీని కొట్టే నాయకుడు ఈ భారతదేశంలో లేరు. పిల్లలను సరైన దారిలో పెట్టడం, సరైన సంస్కారం నేర్పించడం చాలా చాలా అవసరం. ఈ రోజు పొద్దున ప్రధానమంత్రి స్టేట్మెంట్ చూశా. తనను దూషించిన వాళ్లను కూడా క్షమించారు" అని పవన్ చెప్పారు.

## వైభోగమా..వైభాగ్యమా.. భోగాపురం..!

మొదటి పేజీ తరువాయి...

ఆశిస్తుందో ఊహించుకోవచ్చు. ఎయిర్‌పోర్టు వస్తే విశాఖలోని ఇంటిల్లిపాదీ నీరు లేకుండా గొంతెండబెట్టాలా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక పూట కుళాయిలు రాకపోతే ఆ నీటిపైనే ఆధారపడ్డ ఎన్నో లక్షల కుటుంబాల సంగతి ఏంటని ఈ ప్రభుత్వం ఆలోచించిందా...రాజకీయ నాయకుల బుద్ధి అలాగే ఉంటుందని గ్రహించిన జిల్లా యంత్రాంగమైనా చెప్పాలిగా....అదేమీ లేకుండా విశాఖ వాసులకు తాగు నీరు లేకుండా పస్తులు పెట్టేసి నీరు లేకుండా చేసేసి భోగాపురం...వైభోగాపురం అంటూ సంబరాలు ఎవరికి మేలు చేస్తాయో రానున్న రోజుల్లో తేలనుంది. గత రెండు రోజులుగా భోగాపురం పేరు చెప్పి విశాఖ వాసులకు ప్రభుత్వ యంత్రాంగం చుక్కలు చూపించింది. బస్సులు లేకుండా...ట్రాఫిక్ ఆంక్షలతో నగర జన జీవనాన్ని స్తంభింపజేయడంపై విశాఖ వాసులు ఆగ్రహంగానే ఉన్నారు. విద్యాలయాలకు సెలవులు ఇచ్చేసి...డిగ్రీ, పీజీ పరీక్షలను వాయిదా వేసేసి...విశాఖలో ఉన్న ఎయిర్‌పోర్టును తీసేసి...ఇలా చెప్పుకుంటూ పోతే అడుగడుగునా నగర వాసులకు చుక్కలు లెక్కించారు. కూటమి ఎన్ని చెప్పినా...ఎన్ని హామీలు కుమ్మరించినా ఈ కక్ష సాధింపు రుణం తీర్చుకునే రోజు కోసం విశాఖ వాసులు నిరీక్షిస్తూనే ఉన్నారనే వాదన వినిపిస్తోంది.

మరో పక్క అంటే రెండు రోజుల క్రితం జైల్లో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు వైఎస్ జగన్ విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు అంటే 100 కిలోమీటర్ల ప్రయాణానికి దాదాపు ఆరేడు గంటల సమయం పట్టింది. అంటే జగన్‌కు దారి పొడవునా ఎన్ని లక్షల మంది జనం వచ్చారో వేరేగా చెప్పుకోవాల్సిన పరిస్తితి లేదు. పోలీసు ఆంక్షలు...పోలీసుల కేసులు....ఇలా సవాలక్ష ముళ్ల కంచెలను దాటుకుని మరీ జగన్ వెళ్లే మార్గంలోకి వేలాదిగా తరలివచ్చారు. వాళ్లంతా ఎవరో పిలిస్తేనో...టీలు టిఫిన్లు పెడితేనో...బస్సులు ఆటోలు పెట్టి తరలిస్తేనో వచ్చిన జనం కాదు. కానీ మూడు సార్లు ప్రధాని...నాలుగు సార్లు సీఎం...అయిన వ్యక్తులే కాదు...పవర్ స్టార్ పవన్ కళ్యాణ్...జిల్లా యంత్రాంగమంతా కలసి విశాఖలో గత రెండు రోజులుగా కేంద్ర, రాష్ట్ర మంత్రులంతా మకాం వేసి...స్కూళ్లకు సెలవులు....రోడ్లకు బారీ కేడ్లు వేసి మరీ జనాన్ని తరలించడం చూస్తుంటే మడు పార్టీల కూటమి నేతలు గొప్పా....సింగిల్ పార్టీగా వెళుతున్న జగన్ గొప్పా అనే విషయం తేలాలంటే మరి కొద్ది రోజులు ఆగాల్సిందేనన్న భావన నగర వాసుల్లో వ్యక్తమవుతోంది.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అంతా స్వాగతించాలి

మొదటి పేజీ తరువాయి...

ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రతిష్టాత్మక విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అందరూ మనస్ఫూర్తిగా స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత రెండేళ్లుగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో పూర్తయిన సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ ఫలాలను తన ఖాతాలో వేసుకోవడమే పనిగా పెట్టుకున్నారని సజ్జల ఆరోపించారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు హడావుడిగా ఒక శంకుస్థాపన బండ రాయి వేసి ప్రాజెక్టును గాలికి వదిలేశారని సజ్జల విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాకే 15 వేల ఎకరాల భూసేకరణను రీ-డిజైన్ చేసి 2700 ఎకరాలకు తగ్గించి పనులను వేగవంతం చేశారని గుర్తుచేశారు. జీఎంఆర్ సంస్థతో ఒప్పందాలు, అన్ని రకాల పర్యావరణ అనుమతులు తెచ్చి 2023లో వైఎస్ జగన్ అసలైన శంకుస్థాపన చేశారని తెలిపారు. 2026 నాటికి విమానాశ్రయం పూర్తవుతుందని జగన్ ఆనాడే స్పష్టంగా చెప్పారని, కోవిడ్ మహమ్మారి రాకపోయి ఉంటే వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చేదని సజ్జల వివరించారు. అలాగే ఎయిర్‌పోర్ట్‌కు కనెక్టివిటీగా ఉండే 55 కిలోమీటర్ల నేషనల్ హైవే రోడ్డుకు సంబంధించి కేంద్ర అనుమతులు తెచ్చింది కూడా జగన్ సర్కారేనని ఆయన అన్నారు. గత కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల వ్యవధిలో ఆ రోడ్డు నిర్మాణాన్ని కూడా సరిగ్గా పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. భూసేకరణ సమయంలో నరసాయమ్మ అనే మహిళ అన్న మాటలను జగన్ ఉటంకిస్తే, దాన్ని వక్రీకరించి జగన్ మోహన్ రెడ్డి ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకమని విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని, భోగాపురం ప్రాజెక్ట్ వెనుక ఉన్న నిజమైన శ్రమ జగన్‌దేనని సజ్జల ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ఉద్యోగుల శంఖారావం..!

మొదటి పేజీ తరువాయి...

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే 12వ వేతన సవరణ సంఘం చైర్మన్‌ను నియమించాలని, పీఆర్‌సీ నివేదిక వచ్చేలోపు ఉద్యోగుల ఊరట కోసం కనీసం 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. సీఎంతో పాటు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు తక్షణమే దీనిపై స్పందించి చొరవ చూపాలని జేఏసీ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ కోరారు. సమావేశం అనంతరం ఏపీ జేఏసీ ముఖ్య నాయకులు విలేకరులతో మాట్లాడారు. తమ ప్రధాన ఆర్థిక డిమాండ్లను వివరించారు. 11వ పీఆర్‌సీకి సంబంధించిన వేతన వ్యత్యాస బకాయిలు, 2022 నుంచి నిలిచిపోయిన ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులను తక్షణమే ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీంతోపాటు దాదాపు నాలుగైదు కరవు భత్యం వాయిదాలు పెండింగ్‌లో ఉన్నాయని, ద్రవ్యోల్బణం పెరిగినందున పాత డీఏ బకాయిలను విడుదల చేస్తూనే కొత్త డీఏలను వెంటనే ప్రకటించాలని పట్టుబట్టారు.

**వచ్చే రోజుల్లో సచివాలయ ముట్టడి, కలెక్టరేట్ల వద్ద మహాధర్నాలు**

సమస్యల తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇప్పటికే తాము ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి అధికారిక కార్యాచరణ నోటీసు అందజేసినట్లు జేఏసీ స్పష్టం చేసింది. గత జూలై 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చి తమ నిరసనను వ్యక్తం చేశామని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరసనల వేడిని మరింత పెంచక తప్పడం లేదని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి తగిన స్పందన రాకపోతే వచ్చే రోజుల్లో సచివాలయ ముట్టడి, కలెక్టరేట్ల వద్ద మహాధర్నాలు, నిరవధిక సమ్మె దిశగా కార్యాచరణను ఉధృతం చేస్తామని ఏపీ జేఏసీ స్పష్టం చేసింది. లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల సంక్షేమం దృష్ట్యా ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

### దివంగత ముద్రగడకు
## నివాళులర్పించిన కె కె రాజు

**కిర్లంపూడి (జయ జయహే)**

కిర్లంపూడిలో మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం ఆత్మీయ సంతాప సభలో శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ,రీజనల్ కో-ఆర్డినేటర్లు,మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులతో కలిసి పాల్గొని



దివంగత ముద్రగడ పద్మానాభం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన విశాఖపట్నం వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె రాజు

### ఎర్రబస్సు రాదన్నారు..
## ఎయిర్ బస్సు వచ్చింది

**ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ... అర్థమైందా రాజా**

**మోదీజీ వికసిత్ భారత్... సీబీఎన్ విజన్ కు ప్రతిరూపం భోగాపురం ఎయిర్ పోర్ట్**

**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గ్రోత్ ఇంజన్ ఉత్తరాంధ్ర**

**అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో మంత్రి లోకేష్**

**(విశాఖపట్నం జయజయహే)**

కొందరు ఎర్రబస్సు రాని ఊరికి విమానాశ్రయం అవసరమా అని అన్నారు. ఉత్తరాంధ్రను తక్కువగా అంచనా వేసి ఇక్కడి ప్రజలను అవమానించిన వాళ్లకి ఈరోజు దిమ్మ తిరిగే సమాధానమే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఎయిర్ పోర్ట్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్నచోటకి ఎయిర్ బస్ వచ్చింది. ఎర్రబస్సు రాదు అన్న చోటకి ఏకంగా మన నమో వచ్చారు. ఇదీ ఉత్తరాంధ్ర దెబ్బ... అర్థమైందా రాజా..- అంటూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉత్తేజభరితంగా ప్రసంగించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీజీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

**ఉత్తరాంధ్ర కలలకు రెక్కలిచ్చిన నమో**

ఎయిర్ పోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరుడు అల్లూరి సీతా రామరాజు గారు నడయాడిన గొప్ప నేల ఉత్తరాంధ్ర. ఈ రోజు నుంచి ఈ నేల చరిత్ర, పౌరుషం గురించి ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ రోజు కేవలం ఒక ఎయిర్ పోర్ట్ ప్రారంభం మాత్రమే కాదు. మన నమో గారి వికసిత్ భారత్, మన సీబీఎన్ గారి విజన్ కలిసిన రోజు. ఉత్తరాంధ్ర భవిష్యత్తు మారే రోజు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకెళ్లే రోజు. ఈనేలపై స్వాతంత్ర్యం కోసం పోరాడింది అల్లూరి సీతారామ రాజు గారు అయితే ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు ఇచ్చింది మన నమో. రైతుల త్యాగం, కార్మిక కష్టం, మన సీబీఎన్ విజన్‌కు ప్రతిరూపం ఈ విమానాశ్రయం. అల్లూరి సీతా రామరాజు గారికి ఉన్న పట్టుదల, పౌరుషం, దేశ భక్తి నాకు మన నమోలో కనిపిస్తుంది. నమో అంటే ధైర్యం, నమో అంటే విశ్వాసం, నమో అంటే సురక్షిత భారత్. నమో అంటే శత్రువు గుండెల్లో భయం, అభివృద్ధి, పేదల సంక్షేమం, భవిష్యత్తుకు భరోసా కోరుకునే వారికి ఒకే ఒక సమాధానం నమో.

**డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు వల్లే అభివృద్ధి**

రాష్ట్ర విభజన వల్ల మనం కట్టు బట్టలతో ప్రయాణం ప్రారంభించాం. అలాంటి రాష్ట్రాన్ని ఆదుకుంది మన నమో. దేశం మొత్తం నమో అంటే గౌరవ ప్రధాని నరేంద్ర మోదీజీ. ఏపీలో నమో అంటే నాయుడు జీ - మోదీజీ జోడి. ఆ ఇద్దరి కలయికే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. మన రాష్ట్రం లో అతి పెద్ద ఎయిర్ పోర్ట్ ను రికార్డ్ టైమ్ లో పూర్తి చేసారు. ఆంధ్ర ప్రదేశ్ జీవనాడి పోలవరం, అమరావతి పూర్తి చెయ్యడానికి నిధులు ఇచ్చారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేసారు. ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి విశాఖ ఉక్కుని కాపాడారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, ఘావీజూా ఫైటర్ జెట్ ప్రాజెక్ట్స్ మన రాష్ట్రానికి రావడానికి కారణం మన నమో.

**ఆ నమ్మకమే భోగాపురాన్ని ప్రపంచపటంలో పెట్టింది**

మోదీజీ విజన్ -- నాయుడుజీ ఎగ్జిక్యూషన్ -- ఇద్దరి ఏకైక లక్ష్యం వికసిత్ ఉత్తరాంధ్ర. మోదీగారు భారత్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. నాయుడు గారు ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. వారిద్దరిపై ఇక్కడి ప్రజల నమ్మకమే భోగాపురాన్ని ప్రపంచపటంలో పెట్టింది. ఎన్డీఏకి కంచు కోట ఉత్తరాంధ్ర. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్ డిఏకి క్లీన్ స్వీప్ ఇచ్చారు. ఇప్పుడు ఉత్తరాంధ్ర అభివృద్ధి మా బాధ్యత. నదులు, అడవులు, వనరులు, తీరప్రాంతం ఉత్తరాంధ్రకు వరం. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత ఉత్తరాంధ్రను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మార్చింది.

**జన్మభూమి రుణం తీర్చుకున్న జిఎంఆర్**

రాజాం నుండి పారిశ్రామికవేత్తగా ఎదిగిన వ్యక్తి గ్రంధి మల్లికార్జునరావు గారు. రికార్డ్ టైమ్ లో ఎయిర్ పోర్ట్ నిర్మించి జన్మ భూమి రుణం తీర్చుకున్నారు. శ్రీకాకుళం ముద్దు బిడ్డ నా తమ్ముడు కేంద్ర మంత్రి రాముని కూడా అభినందిస్తున్నాను. 5నెలల ముందే ఎయిర్ పోర్ట్ పూర్తిచేసాడు. అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకి వరం. ఇది ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మారబోతుంది. ఎక్స్ పోర్ట్, ఇంపోర్ట్ హబ్ కాబోతుంది. పరిశ్రమలు, ఐటీ, టూరిజం, హాస్పిటాలిటీ రంగాలకు ఈ విమానాశ్రయం వారధి కాబోతుంది. రోడ్డు, రైలు, విమాన, వాటర్ కనెక్టివిటీతో ఉత్తరాంధ్ర ఆంధ్రప్రదేశ్ కి గ్రోత్ ఇంజన్ గా నిలుస్తుంది.

**ఉత్తరాంధ్ర అంటే వలసలు ఒకప్పుడు...ఇప్పుడు భవిష్యత్తు**

ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వలసలు, వెనకబాటుతనం, చిన్నచూపు. ఇప్పుడు ఉత్తరాంధ్ర అంటే ఉద్యోగాలు, ఉపాధి, బంగారు భవిష్యత్తు. ఇప్పుడు ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం విమానాలు ఎక్కాల్సిన అవసరం లేదు. అవకాశాలే విమానం ఎక్కి ఉత్తరాంధ్రకి వస్తాయి. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయింది. ఈ రెండేళ్లలో మన నమో రాష్ట్రానికి 5సార్లు వచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ అన్నా, ఇక్కడ ప్రజలు అన్నా ఆయనకు ఎంతో ప్రేమ. రాష్ట్రం కోసం మనం అడిగినవన్నీ ఆయన ఇచ్చారు. గుజరాత్ లో ఒకే ప్రభుత్వం దీర్ఘకాలంగా కొనసాగుతోంది కాబట్టే అభివృద్ది చెందింది. ఆంధ్ర ప్రదేశ్ కూడా అభివృద్ది కావాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యం. సంక్షేమం - అభివృద్ది ప్రజా ప్రభుత్వానికి జోడెద్దుల బండి. ఇది ఈస్ట్ ఇండియా కంపెనీ కాలం కాదు... ఇది ఈస్ట్ కోస్ట్ ఇండియా యుగం. ఇప్పుడు ఈస్ట్ కోస్ట్ ఇండియా ఉజ్వలంగా ప్రకాశిస్తోంది. సుందర్‌బన్ నుంచి శ్రీహరికోట వరకు, ఎన్డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాకెట్‌లాగా దూసుకుపోతూ అభివృద్ధి సాధిస్తోంది. ఇది నమో (నరేంద్ర మోదీ) శక్తి- అని మంత్రి లోకేష్ ప్రశంసించారు.

# గోదావరి ఉగ్రరూపం

**13 అడుగులకు చేరిన నీటి మట్టం**

**పెరుగుతున్న వరద ఉధృతి**

**భయం గుప్పిట్లో లంక గ్రామాల ప్రజలు**

**ఇప్పటికే నీట మునిగిన లంక గ్రామాలు**

**అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు**

**(రాజమహేంద్రవరం - జయజయహే)**



గోదావరి నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. అంతకంతకూ నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఇక్కడ నీటిమట్టం 13 అడుగులు నమోదైంది. నీటిమట్టం 13.75 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో అధికారులు కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. గోదావరికి వరద పోటెత్తడంతో లంక గ్రామాలు వణుకుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు కారణంగా గోదావరికి వరద నీరు పోటెత్తడంతో కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి వంతెన వద్ద గోదావరి ఉరకలేస్తుంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వరద నీటిని విడిచిపెట్టడంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరుగుతుంది. రావులపాలెంలోని గౌతమి వంతెన వద్ద పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. ముక్తేశ్వరం రేవు కోటిపల్లిలో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. వీరవల్లి పాలెంలోని లంకలకు వరద నీరు పోటెత్తింది దీంతో నాటు పడవలపై ప్రజలు రాకపోకలను సాగిస్తున్నారు. వరద ఉధృతి మరింత పెరిగి పల్లపు ప్రాంతాలను ముంచెత్తే అవకాశం ఉండటంతో పశు పోషకులు తమ పశువులను గట్ల పైకి తరలిస్తున్నారు. అరటి, కొబ్బరి ఉత్పత్తులను రైతులు ట్రాక్టర్ల పై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ముక్తేశ్వరం, తొగరపాయ వద్ద గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండటంతో పాత వంతెన పూర్తిగా నీట మునిగింది. ఈ ప్రాంతంలో ఉన్న శ్మశానవాటికలు గోదావరిలో కలిసిపోయాయి. సురక్షిత ప్రాంతాలకు: పలు జిల్లాలలో విస్తరంగా కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతోంది. పలు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడతున్నారు. గోదావరికి వరద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో గోదావరికి వరద నీరు పెరగడంతో లంక గ్రామాల్లో నివసించే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గోదావరి ప్రవాహం ఇళ్ల వరకు చేరడంతో ప్రజలు సురక్షిత ప్రాంతానికి తరలిపోతున్నారు. రాకపోకలు బంద్: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి దాదాపు మూడు లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టడంతో వశిష్ట తీరాన ఉన్న స్నానాల రేవులన్నీ నీట మునిగాయి. గోదావరికి వరద ఉధృతి తగ్గేవరకూ మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. రాజమహేంద్రవరం ఎడతెరిపిలేని వానతో ప్రధాన రహదారులు, కూడళ్లు నీటమునిగాయి. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షపు నీటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

**ప్రజలకు అందుబాటులో కంట్రోల్‌రూం నంబర్లు**

కోనసీమ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్: 08856 - 293104

అమలాపురం: 08856 - 233208

రామచంద్రపురం: 08857 - 245166

కొత్తపేట: 85002 - 38258, 08855 - 244299



## ఉద్యానవన క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా ఉద్యానవన అధికారి

**శ్రీకాళహస్తి ఆగస్టు 1(జయ జయహే)**

తిరుపతి జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానవన అధికారి లిజి. జయ భరత్ రెడ్డి శ్రీకాళహస్తి ఉద్యానవన క్షేత్రాన్ని సందర్శించారు. క్షేత్రంలో రైతులకు అందుబాటులో ఉన్న మొక్కల నిల్వలు, కొబ్బరి నారు మొక్కల ఉత్పత్తి, నర్సరీ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి మాట్లాడుతూ, అక్టోబర్ నెల నాటికి సుమారు 5,000 కొబ్బరి నారు మొక్కలు రైతులకు పంపిణీకి సిద్ధంగా ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో కొబ్బరి నారు మొక్క ధర రూ.70గా నిర్ణయించబడినట్లు వెల్లడించారు. అనంతరం శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన పాలీహౌస్, వ్యవసాయ కుంటలను (ఫార్మ్ పాండ్లు) పరిశీలించారు. వాటి ద్వారా నీటి సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. తదుపరి ఒబులపల్లి గ్రామంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 14 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ తోట ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు రైతులకు అధిక ఆదాయాన్ని అందించే లాభదాయక పంటగా నిలుస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగుకు అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు మరియు సాంకేతిక సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని జిల్లా ఉద్యానవన అధికారి రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఉద్యాన శాఖ అధికారి ఎ. పుష్పలత, ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



## అమూల్యం... జవహర్ సేవలు...!


**కొనియాడిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి**

**విశాఖపట్నం, ఆగష్టు 1, జయ జయహే**

తోటి మనుష్యులకు ఉపకారం అందించడంలో జవహర్ లాల్‌ను మించిన వ్యక్తులు లేరని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ వాణి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రా వైద్య కళాశాల ఆఫీస్ సూపరింటెండెంట్ పీఎం జవహర్‌లాల్ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆమె మాట్లాడుతూ జవహర్ కోసం ప్రత్యేకించి ఎంత చెప్పినా తక్కువేనని...ఈ సన్మానానికి వచ్చిన వందలాది మందే ఆయన సేవలకు ప్రత్యక్ష సాక్ష్యమని కొనియాడారు. ఆంధ్రా వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. కృష్ణ వేణి మాట్లాడుతూ జవహర్ చేసే పనులు ఎవరికీ అంతుబట్టేవిగా ఉండవన్నారు. ఆయన చేపట్టే పనులు సాధారణంగా ఎవరూ చేయలేరని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. రాజ్‌కమల్ మాట్లాడుతూ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా జవహర్ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎన్‌జీవో ప్రెసిడెంట్ కఠారి ఈశ్వర రావు, ఏపీజీఈఏ ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి, హంస జిల్లా అధ్యక్షులు చినబాబు, ఐఎన్‌టీయసీ ప్రతినిధి ఎస్‌వీ రమణ, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు గంగా భవానీ తదితరులు మాట్లాడుతూ జవహర్ విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరిని కొనియాడారు. సహ ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సంస్థ అభివృద్ధికి సహకారం అందించేవారని పేర్కొన్నారు. జవహర్‌లాల్ మాట్లాడుతూ తన 33 ఏళ్ల ఉద్యోగ నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏ కార్యక్రమం చేపట్టినా అందుకు సహకరించిన వారందరికీ థాంక్స్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దాదాపు 740 మంది ఉద్యోగులు హాజరై జవహర్‌లాల్‌ను ఘనంగా సన్మానించారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఉద్యోగులే కాకుండా ఉత్తరాంధ్రలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన వందలాది మంది ఉద్యోగులు హాజరై జవహర్‌లాల్ సేవలను కొనియాడి జవహర్‌లాల్, సురేఖలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి, ఆంధ్రా వైద్య కళాశాల ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గనులశాఖపై రాబందులు

మొదటి పేజీ తరువాయి...




చేసుకుంటారు. ఈ ఫణిగిరి కొండపై గతంలో మైనింగ్ తవ్వకాలు జరపడంతో పంచదారలలో ఒక దార ఆగిపోయింది. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ కొండను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించారు. ఈ ఏడాది జనవరిలో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో సైతం ఇక్కడ తవ్వకాలు జరపరాదని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ఏడాది మే నెలలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తన బంధువు కు ఇక్కడ మైనింగ్ అనుమతులు ఇప్పించారు. నాటి నుంచి రేయింబవళ్ళు అక్రమ మైనింగ్ నిరాటంకంగా సాగింది. మైనింగ్ లోతు ఎక్కువగా కావడంతో పంచదారలలో స్వచ్ఛమైన నీటికి బదులు బురద నీరు రావడంతో ప్రజలు శాపనార్థాలు పెట్టారు. దీనిని వైసీపీ రాజకీయంగా వాడుకుని మైలేజ్ పెంచుకుంది. ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున నిరశనలు వ్యక్తం కావడంతో ఎట్టకేలకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అనకాపల్లి జిల్లా మైన్స్ ఏడీ ని సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకుంది.

**సూత్రధారులు సేఫ్...**

ఈ అక్రమ మైనింగ్ వ్యవహారం వెనుక పెద్ద తలకాయలు ఉన్నాయి. అనకాపల్లి ఏడీ సస్పెన్షన్ వ్యవహారాన్ని పరిశీలిసే తెరవెనకఅధికారులపై తీవ్ర స్థాయిలో రాజకీయ ఒత్తిళ్ల ఉన్నట్లు తెలుస్తోంది. లీజుదారుడు అనకాపల్లి ఎంపీకి బంధువు కావడంతో కేవలం జరిమానాతో సరిపెట్టారు. వాస్తవానికి గనులు, రెవెన్యూ శాఖ అధికారులెవరూ మైనింగ్ ఏరియాకు వెళ్లవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది ఈ నాయకులే. ఈ వ్యవహారం అటు తిరిగి ఇటు తిరిగి ప్రభుత్వ ప్రతిష్ట కు భంగం కలగడంతో తమ పార్టీ నాయకులను ఏమీ అనలేక ఉద్యోగులపై వేటు కు సిద్ధపడ్డారన్నది వాస్తవం. గనుల శాఖ ఏడీపై ఎలా చర్యలు తీసుకుంటారు ? సదరు మైనింగ్ వైపు తొంగి చూస్తే సంగతేంటో తేలుస్తామని సదరు పెద్దలే బెదిరించారు. పొల్యూషన్ అధికారులు వద్ద నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది కనుక మైనింగ్ అధికారులు కూడా అనుమతులు ఇచ్చారు. మరి పొల్యూషన్ అధికారులపై చర్యలు ఏవీ ? వాస్తవానికి ఈ ఎపిసోడ్ లో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ ను కూడా బాధ్యులను చేయాలి. ఈ అక్రమ మైనింగ్ పై జిల్లా కలెక్టర్ నిర్వహించే పీజీఆర్ ఎస్ కు ఫిర్యాదులు ఎన్నో వెళ్లాయి. వాటిపై ఏం చర్యలు తీసుకున్నారు ? మరి జిల్లా కలెక్టర్ పై కూడా చర్యలు తీసుకోవాలి కదా ? పీకల మీదకు వచ్చేసరికి ఇపుడు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్, వీఆర్వో లను తెరమీదకు తీసుకువచ్చి వాళ్లపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గనుల శాఖ మంత్రిగా కొల్లు రవీంద్ర బాద్యతలు చేపట్టిన నాటి నుండి అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయని తమ వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని ప్రతిపక్షాలు బాహాటంగా సవాల్ విసురుతున్నారంటే ఈ శాఖలో ఊహకందని అవినీతి జరిగిందని ప్రజలు కూడా భావిస్తున్నారు. కాగా ఈ ఎపిసోడ్ లో కీలక పాత్రధారులైన గనుల శాఖ మంత్రి, ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ సేఫ్ జోన్ లోకి వెళ్లిపోయారు. జరిగిన అవినీతి పై తక్షణ చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం కలరింగ్ ఇస్తున్నా ప్రజలు నమ్మడం లేదు. ఎందుకంటే సాక్షాత్తు ప్రజల కళ్ల ముందే ఈ అవినీతి జరిగింది. ఫిర్యాదులు చేసారు. ఆందోళనలు చేసారు. అక్రమ మైనింగ్‌ను గ్రామస్తులు అడ్డుకున్నపుడు అక్కడ నిర్వాహకులే బాహాటంగా తెర వెనుక పెద్దలు గురించి చెప్పి బెదిరించారు. మరి ఇపుడు కూటమి నాయకులు చెబుతున్న కహానీలు ఎవడు వింటాడు. ఏది ఏమైనప్పటికీ అనకాపల్లి జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంచి అభివృద్ధి కార్యక్రమాలు అయితే జరిగాయి. అయితే ఈ అక్రమ మైనింగ్ తో అదంతా బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారి కూటమి ప్రభుత్వం ప్రజల ముందు దోషిలా మారింది.





## దివంగత ముద్రగడకు నివాళులర్పించిన కె కె రాజు

**కిర్లంపూడి (జయ జయహే)**

కిర్లంపూడిలో మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం ఆత్మీయ సంతాప సభలో శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ,రీజనల్ కో-ఆర్డినేటర్లు,మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులతో కలిసి పాల్గొని దివంగత ముద్రగడ పద్మానాభం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన విశాఖపట్నం వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె రాజు

## తెలుగు రాష్ట్రాల మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే

**మరో వారం రోజుల్లో ప్రారంభం**

**ఎన్ హెచ్ 365గా నామకరణం**

**(హైదరాబాద్ - జయజయహే)**

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే అనేక నేషనల్ హైవేలు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఇవి తెలుగు రాష్ట్రాల్లో ప్రజా రవాణాను వేగవంతం చేయడంతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా రోడ్డు కనెక్టివిటీ అందిస్తున్నాయి. ఇక మరికొన్ని కొత్త హైవేలు నిర్మాణం దశలో ఉండగా.. అందులో ఒకటి త్వరలో అందుబాటులోకి రానుంది. ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దీంతో మరో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో దీనిని ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ హైవేకు ఎన్‌హెచ్ 365బీజీగా నామకరణం చేశారు. కొంతకాలం క్రితం నుంచి వైరా నుంచి దేవరపల్లి మధ్య వాహనాలను అనుమతించగా.. ఇప్పుడు పెండింగ్ పనులు కూడా పూర్తవ్వడంతో పూర్తిస్థాయిలో వాహనాలను అనుమతించనున్నారు. ఇప్పటికే రోడ్లు, వంతెనల నిర్మాణం పూర్తవ్వగా.. ధ్వంసలాపురం సమీపంలో రైల్వే ట్రాక్‌పై రోడ్ ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పుడు ఎడమవైపు ఆర్వోబీ నిర్మాణం కూడా పూర్తి కావడంతో రాకపోకలను అనుమతించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. ఈ హైవే ఖమ్మం జిల్లాలో 105 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ పనుల కోసం 3 ప్యాకేజీలుగా రూ.2123 కోట్ల వ్యయం ఖర్చు పెట్టారు. ఈ జాతీయ రహదారిపై 80,100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయవచ్చు. దీని వల్ల హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు జర్నీ భారీగా తగ్గనుంది. దాదాపు 56 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. తరచుగా హైదరాబాద్ నుంచి వేలాదిమంది విశాఖపట్నం వెళ్తుంటారు. వీరికి వేగవంతమైన ప్రయాణాన్ని అందించనుంది. పనులు పూర్తి కావడంతో ఆగస్ట్ 1 నుంచే పూర్తిస్థాయిలో ఈ రహదారిని ప్రారంభించాలని అధికారులు తొలుత భావించారు. కానీ రెండు, మూడు రోజులు ఆలస్యం కానుంది. హైవేపై అత్యాధునిక టోల్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. ఓఆర్ఆర్ తరహాలో టోల్ వ్యవస్థ ఉంటుంది. మీరు హైవేపై ఎంత దూరమైతే ప్రయాణం చేశారో.. అంత దూరానికి మాత్రమే టోల్ వసూలు చేస్తారు. వాహనం ఎంట్రీ, ఎగ్జిట్ వరకు ఉండే దూరాన్ని బట్టి టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రతీ కిలోమీటర్‌కు ఒక సీసీ కెమెరా ఉంటుంది. దీంతో హైవేపై భద్రత పటిష్టంగా ఉంటుందని చెప్పవచ్చు. ఇక వందనం, చౌడవరం సమీపంలో భారీ వాహనాల కోసం ట్రక్ లే బైలు ఏర్పాటు చేశారు. సూర్యాపేట వైపు నుంచి వచ్చే వెహికల్స్ ఖమ్మం జిల్లాలోని తెల్దారుపల్లి టోల్ గేట్ కూడా గ్రీన్‌ఫీల్డ్ హైవేలోకి ఎంట్రీ అవుతాయి. దేవరపల్లి సమీపంలో ఎగ్జిట్ గేటు ఉంటుంది. అమరావతి నుంచి నాగపూర్ వెళ్లే హైవేతో ఈ జాతీయ రహదారిని అనుసంధానం చేశారు. వందనం-కొదుమూరు వద్ద ఇది అనుసంధానం అవుతుంది.

## పవన్‌తో గ్రంథాలయ చైర్మన్ వన్నెంరెడ్డి

**విశాఖపట్నం, ఆగష్టు 1, జయ జయహే :**



అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ప్రారంభోత్సవ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు వన్నెంరెడ్డి సతీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక అడుగు పడిందని, అల్లూరి సీతారామరాజు నడయాడిన నేల మన ఉత్తరాంధ్ర పేరు నలుదిశలా వ్యాప్తికి మార్గం సుగమం అయ్యిందన్నారు. ఇవాళ్టి నుంచి ఈ నేల చరిత్ర, పౌరుషం.. ప్రపంచం మొత్తానికి తెలుస్తుందని, నమో ప్రపంచ నాయకుడు మన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ వికసిత్ భారత్, చంద్రబాబు విజన్ మేళవింపు, పవన్ కళ్యాణ్ అభివృద్ధి లక్ష్యం నెరవేరిన రోజుగా పేర్కొన్నారు. భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజన్‌గా ఉత్తరాంధ్ర మారబోతోందని, అలాగే విమాన విడిభాగాల తయారీ, మరమ్మత్తు కేంద్రాలు, శిక్షణ సంస్థలతో వేలాది ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



## విదేశీ నేలపై మసకబారుతున్న భారతీయుల కలలు

(ప్రతాప్)

**ఉపాధి, ఉన్నత విద్య, మెరుగైన జీవన ప్రమాణాల కోసం ప్రతి ఏడాది లక్షలాది మంది భారతీయులు విదేశాలకు వెళుతున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు, అమెరికా, కెనడా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాలు భారతీయుల ప్రధాన గమ్యస్థానాలుగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.5 కోట్ల మంది భారతీయ మూలాల ప్రజలు నివసిస్తుండగా, వారిలో దాదాపు కోటి మంది గల్ఫ్ దేశాల్లోనే జీవిస్తున్నారు. విదేశాల్లో భారతీయులు సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణమైనప్పటికీ, ఇటీవలి కాలంలో పెరుగుతున్న మరణాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉపాధి కోసం వెళ్లిన వారు శవపేటికల్లో స్వదేశానికి తిరిగి రావడం కుటుంబాలతో పాటు సమాజాన్నీ కలచివేస్తోంది.**

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం, 2023 నుంచి 2025 మధ్య విదేశాల్లో వివిధ కారణాలతో 39 వేలకుపైగా భారతీయులు మరణించారు. ఇందులో సహజ మరణాలతో పాటు కార్యాలయ ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, ఆత్మహత్యలు, అనారోగ్యం, నేర ఘటనలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. కార్యాలయ ప్రమాదాల వల్ల సౌదీ అరేబియాలో 182 మంది, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 128 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోగా, అమెరికా, కెనడా, సింగపూర్, మాల్దీవుల్లో కూడా ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి.

అత్యంత ఆందోళనకర అంశం ఆత్మహత్యల పెరుగుదల. 2023--2025 మధ్య విదేశాల్లో 1,900 మందికి పైగా భారతీయులు ఆత్మహత్య చేసుకోగా, అందులో 1,340 మంది గల్ఫ్ సహకార మండలి దేశాల్లోనే మరణించారు. ఒక్క యూఏఈలోనే 511, సౌదీ అరేబియాలో 354, కువైట్‌లో 162, ఒమన్‌లో 146, బహ్రెయిన్‌లో 101, ఖతార్‌లో 66 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా నమోదైన భారతీయుల ఆత్మహత్యల్లో 70 శాతానికి పైగా గల్ఫ్ దేశాల్లోనే జరగడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

ఈ మరణాల వెనుక అనేక సంక్లిష్ట కారణాలు ఉన్నాయి. గల్ఫ్ దేశాల్లో పనిచేసే కార్మికుల్లో అధిక శాతం నిర్మాణ రంగం, చమురు పరిశ్రమలు, భారీ పరిశ్రమలు వంటి ప్రమాదకర రంగాల్లో పనిచేస్తున్నారు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, అధిక పని గంటలు, భద్రతా ప్రమాణాల అమలులో లోపాలు, శారీరక శ్రమ, తగిన విశ్రాంతి లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో భద్రతా పరికరాల వినియోగం సరిగా లేకపోవడం, కార్మిక చట్టాల అమలులో లోపాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

ఆత్మహత్యలకు దారితీసే కారణాలు మరింత సంక్లిష్టంగా ఉన్నాయి. కుటుంబానికి దూరంగా ఒంటరి జీవితం, అప్పుల భారంతో విదేశాలకు వెళ్లడం, ఆశించిన వేతనం రాకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, యజమానుల వేధింపులు, భాషా సమస్యలు, మానసిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం వంటి అంశాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొందరు మధ్యవర్తుల తప్పుడు హామీలను నమ్మి విదేశాలకు వెళ్లి, అక్కడ వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉండటంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఉద్యోగం కోల్పోవడం, వీసా సమస్యలు, జీతాల ఆలస్యం, పాస్‌పోర్టుల స్వాధీనం వంటి సమస్యలు మానసిక ఆందోళనను మరింత పెంచుతున్నాయి.

అమెరికా, కెనడా వంటి దేశాల్లో చదువుతున్న విద్యార్థులు కూడా చదువు ఒత్తిడి, అధిక జీవన వ్యయం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, ఒంటరితనం, మానసిక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విదేశాల్లోని భారతీయుల మరణాల్లో గుండె సంబంధిత వ్యాధులు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, హింసాత్మక ఘటనలు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి.

ప్రవాస భారతీయ బీమా యోజన ద్వారా ఎమిగ్రేషన్ చెక్ రిక్వైర్డ్ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించినప్పుడు రూ.10 లక్షల వరకు బీమా రక్షణ కల్పించడం అభినందనీయం. అయితే బీమా ఒక్కటే సరిపోదు. విదేశాలకు వెళ్లే ముందు ఉద్యోగ ఒప్పందాలపై సమగ్ర అవగాహన కల్పించడం, నైపుణ్య శిక్షణతో పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అక్రమ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవడం, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో అత్యవసర సహాయ కేంద్రాలు, 24 గంటల హెల్ప్‌లైన్లు, తెలుగు సహా భారతీయ భాషల్లో కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంచడం అవసరం.

విదేశాలకు వెళ్లడం తప్పు కాదు; కానీ సురక్షిత వలస, గౌరవప్రదమైన ఉపాధి, సమర్థవంతమైన రక్షణ వ్యవస్థలు లేకపోతే ఆ కలలు విషాదంగా మారే ప్రమాదం ఉంది. విదేశాల్లో ఉన్న ప్రతి భారతీయుడి ప్రాణం దేశానికి విలువైనదే. వారి భద్రత, సంక్షేమం, మానసిక ఆరోగ్యం పట్ల ప్రభుత్వం, యజమానులు, రాయబార కార్యాలయాలు, కుటుంబ సభ్యులు సమిష్టిగా బాధ్యత వహించినప్పుడే ఈ విషాదాలను గణనీయంగా తగ్గించడం సాధ్యమవుతుంది.



# స్నేహాని కన్న మిన్న లోకాన లేదురా...

**స్నేహితులు లేని జీవితం ఉప్పు లేని కూరలా వృథా అనే చెప్పాలి. మంచి స్నేహితులు ఉన్న వారు అదృష్టవంతులనే చెప్పాలి. కుటుంబ సభ్యులతో పంచుకోని అనుభవాలు, స్నేహితులతో షేర్ చేసుకుంటారు. కష్టం వస్తే ముందుగా గుర్తుకు వచ్చేది స్నేహితుడే. ఆగస్టు 2 వ తేదీ స్నేహితుల దినోత్సవం సందర్భంగా కొన్ని విషయాలు మీతో పంచుకుంటున్నా.**




స్నేహమంటే కృష్ణ కుచేల స్నేహంగా ఉండాలి. తర్వాత స్థానం కృష్ణార్జులది. కృష్ణుడు అర్జునుడికి సారధి కావడం వలనే పాండవులు యుద్ధంలో విజయం సాధించారు. నిజమైన స్నేహితులు వారి స్నేహాన్ని గెలిపించాలి. స్నేహం అంటే నమ్మకం, నిజాయితీ, విశ్వాసం, కష్టనష్టాల్లో పాలుపంచుకుని నిస్వార్థమైన పదార్థం స్నేహం. స్నేహంలో ఎల్లవేళలా దృఢమైన నమ్మకం ఉంటేనే స్నేహం జీవితకాలం పరిమళిస్తుంది. స్నేహితుల మధ్య ఎన్నడూ మూడో వ్యక్తికి తావులేదు. రెండు మనసుల అంతరంతారాల్లో ఏర్పడే భావనే స్నేహం. స్నేహం అనగా దేవాలయంలో దీపం లాంటిది.నమ్మకం అనే చమరిపోస్తే చీకటిలో కూడా ప్రకాశవంతంగా వెలుగునిస్తుంది స్నేహం. రక్తసంబంధంతో బంధాలు ఏర్పడితే నమ్మక, విశ్వాసాలతో స్నేహాలు ఏర్పడతాయి. స్నేహాల్లో స్థాయి, మతం, కులం, ఎటువంటి కట్టుబాట్లకు అసమానతులకు తావులేదు "ఆపదలందు దోడుపడుట అభ్యుదయము

తోడు నీటుగా నిలుచుట తలగకపోవుట
కాపురమున కీర్తి తెచ్చుట
మేలైన మిత్ర లక్షణమ్ము మేదినితోన్......"

తిక్కన కవి స్నేహబంధం కోసం మహాభారతంలో రాసిన ఈ పద్యంలో కష్టంలో అండగా ఉండడం మంచి సమయంలో గర్వపడడం ఎప్పుడూ వదలకుండా ఉండడం మిత్రునికి పేరు తేవడం ఇవన్నీ నిజమైన స్నేహ లక్షణాలు. ఇటువంటి స్నేహం కోసం ఎంతోమంది ఎన్నో రకాలైన భాషాజాలంతో మనందరినీ స్నేహమనే మత్తులో బంధించారు. బాల్యంలో చివరించిన స్నేహం ఎదిగి ఎదిగి వయసుతో పాటు పెరిగి పెద్దయి వృక్షంలో పాతుకు పోవాలి అంటే ఎటువంటి స్నేహాన్ని ఎంచుకోవాలి అని ఆలోచన చేస్తేనే స్నేహం అత్యున్నత స్థాయికి చేరి కీర్తి శిఖరాలకు సుగంధ పరిమళాలు వెదజల్లుతుంది. దేవుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మని సృష్టిస్తాడు. తల్లిదండ్రుల ప్రేమానురాగం తోబుట్టువులు ఆత్మీయత గురువుల మార్గదర్శకత్వాన్ని ఇచ్చేదే స్నేహం. నిజమైన స్నేహం చాలు మనిషి ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే. సంపదలు కోల్పోయిన కష్టనష్టాలు చవిచూసే సమయంలో ఉన్న చేయి విడవనిదే స్నేహం.

**ఎటువంటి స్నేహాన్ని ఎంచుకోవాలి :**

ప్రకృతిలో ఋతువులు ఆరు ఉన్నట్లే. అదే ప్రకృతిలో స్నేహాలు ఆరు రకాలు ఉన్నాయి.

**1. బాల్య స్నేహం:**

అగర్వ శ్రీమంతుడు శ్రీకృష్ణుడు. దారిద్ర్యానికి ప్రతిరూపం సుధాముడు. కానీ వీరిలో ఏర్పడ్డ బాల్య స్నేహం పెరిగి పెద్దయి సుధామ జీవితాన్ని మార్చే విధంగా సంపద సౌఖ్యం ఇచ్చింది బాల్య స్నేహమే అతి విలువైన స్నేహం అని మనం తెలుసుకోవచ్చు.

**2. సత్పురుషుల స్నేహం**

రాముడు మనసు వికలమైన సందర్భంలో యతివేషంలో హనుమంతుడు పంపాడు అని చెప్పి సర్వ సమర్థుడైన మా వానర్ రాజు మీరు స్నేహం చేస్తే సమస్త లోకాలకి లాభం కలుగుతుందని రామసుగ్రీవ మైత్రిన చేయించిన హనుమ గొప్పదనం లంక నగర అన్వేషణ భావించడం సీతను కనుగొనడం జరిగింది. ఇది సత్పురుషుల స్నేహానికి ఒక మచ్చు తునక.

**3. గుణ స్నేహం: వాల్యూ ఫ్రెండ్ షిప్.**

నిన్ను నిన్నుగా చూస్తూ నీకు కావలసిన విషయాలను తెలియచేసే స్నేహం మన స్నేహం మనకు కావలసిన దాన్ని మాత్రమే మన కోసం ఇచ్చే అతి పవిత్రమైన స్నేహం.

**4. వైరస్ స్నేహం**

బాల్యంలో స్నేహితులు ద్రుపదుడు, ద్రోణుడు. దృపదుడు రాజు అయి అద్దనం మదంతో రాజు అనే గర్వంతో హీనంగా ద్రోణుడిని చూస్తూ అనేక రకాలైనటువంటి మాటలు ఆడి తన యొక్క స్నేహాన్ని కృంగికంచిపోయేలా చేసాడు ఇది కేవలం వైరంతో మాత్రమే ఏర్పడిన బంధం. యోగ్యదాయకమైన స్నేహం కాదు.

**5. స్వార్థ స్నేహం**

దుష్టుల తో సహవాసం జీవితాన్ని ఎలా బలి తీస్తుందో కర్ణ దుర్యోధనల మైత్రే మనకు నిదర్శనం.

**6. ఆత్మ స్నేహం**

ఒకరి మనసులో భావన మరొకరికి మనసు అంతరాల్లో నుండి తెలుసుకోవడమే ఈ ఆత్మ స్నేహం. స్నేహితులు మనసులో విషయాలు బయటకు చెప్పకుండా తెలుసుకోవడం. ఇది గత జన్మ రుణానుబంధంతో దేవుడిచ్చిన అతి విలువైన స్నేహం ఎటువంటి స్నేహాన్ని కచ్చితంగా అందరూ చేయాలి ఎప్పటికీ దూరం చేసుకోకూడదు.

**స్నేహం కోసం చేయవలసిన అంశాలు:**

స్నేహమంటే అతి మధురమైనది అని భావించి స్నేహాన్ని గౌరవించగలగాలి. స్నేహంలో ఉన్న చిన్న మనస్పర్ధలను లెక్కచేయకూడదు .

స్నేహితుడు ఎటువంటి ఆపదలో ఉన్న వెంటనే స్పందించాలి. ఎక్కువ సమయం స్నేహితునికి వెచ్చించాలి. స్నేహితుని ఆలోచనలకు గౌరవం ఇవ్వాలి. స్వార్థం కోసం కాకుండా స్నేహం కోసం స్నేహం చేయాలి. ప్రతి జీవి స్నేహంలో ఉండే మాధుర్య మకరందాన్ని ఆస్వాదించాలి.



**అందరికీ అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు**

**ఏ బాల సౌజన్యకుమారి, నంది అవార్డు గ్రహీత,
మహిళ కీర్తి రత్న, జాతీయ అవార్డు గ్రహీత,
తెలుగుఆచార్యులు,
ఆధ్యాత్మికవేత్త,ప్రవచన కర్త, అనకాపల్లి**

# ఉన్నత విద్యారంగంలో కీలక పురోగతి

(ప్రతాప్)

**భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ ఉన్నత విద్యా సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) 2023--24 నివేదిక (2025 నవంబరులో విడుదల) దేశంలోని ఉన్నత విద్యా రంగంలో నమోదైన కీలక పురోగతిని ప్రతిబింబించింది. ఉన్నత విద్యలో నమోదు, లింగ సమానత్వం, సామాజిక వర్గాల భాగస్వామ్యం, విజ్ఞాన శాస్త్రం--సాంకేతిక విజ్ఞానం--ఇంజినీరింగ్--గణితం విద్యా విభాగంలో మహిళల ప్రాతినిధ్యం వంటి అనేక సూచికల్లో భారత్ గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. ఉన్నత విద్యా విధానాల రూపకల్పన, ప్రణాళిక, పర్యవేక్షణకు ఈ సర్వే అత్యంత ప్రామాణిక అధికారిక గణాంక ఆధారంగా గుర్తింపు పొందింది.**



నివేదిక ప్రకారం, 2023--24లో ఉన్నత విద్యలో మొత్తం నమోదు 4.50 కోట్లకు చేరుకోగా, 2014--15తో పోలిస్తే ఇది 31.5 శాతం పెరుగుదల. మహిళల నమోదు 1.57 కోట్ల నుంచి 2.24 కోట్లకు పెరిగి 42.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. స్థూల నమోదు నిష్పత్తి 23.7 శాతం నుంచి 30 శాతానికి, మహిళల స్థూల నమోదు నిష్పత్తి 22.9 శాతం నుంచి 31.2 శాతానికి పెరగడం ఉన్నత విద్య అందుబాటు విస్తరిస్తున్నట్లు సూచిస్తోంది. లింగ సమానత్వ సూచీ 1.08గా నమోదవడం వరుసగా ఏడవ సంవత్సరం కూడా మహిళల భాగస్వామ్యం పురుషులతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉందని తెలియజేస్తోంది.

సామాజిక న్యాయం దిశగా కూడా విశేష పురోగతి కనిపించింది. షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నమోదు 69.72 లక్షలు, షెడ్యూల్డ్ తెగల విద్యార్థుల నమోదు 28.83 లక్షలు, ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థుల నమోదు 1.80 కోట్లకు చేరాయి. 2014--15తో పోలిస్తే షెడ్యూల్డ్ కులాల నమోదు 51.4 శాతం, షెడ్యూల్డ్ తెగల నమోదు 75.7 శాతం, ఇతర వెనుకబడిన తరగతుల నమోదు 60.2 శాతం పెరిగాయి. అదేవిధంగా, షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి 18.9 శాతం నుంచి 27.8 శాతానికి పెరగడం వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్య మరింత చేర-ువవుతున్నదని సూచిస్తోంది.

విజ్ఞాన శాస్త్రం--సాంకేతిక విజ్ఞానం--ఇంజినీరింగ్--గణితం విద్యా విభాగంలో కూడా గణనీయమైన అభివృద్ధి నమోదైంది. ఈ విభాగంలో మొత్తం నమోదు 1.02 కోట్లకు చేరుకోగా, మహిళల వాటా 38.4 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. దేశంలో 17.32 లక్షల మంది అధ్యాపకులు ఉండగా, వారిలో 44.9 శాతం (7.78 లక్షలు) మహిళలు కావడం ఉన్నత విద్యా రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతున్న సంకేతం. మొత్తం నమోదిత ఉన్నత విద్యా సంస్థలలో 59,533 సంస్థలు (90 శాతానికి పైగా) సర్వేకు గణాంకాలను సమర్పించడం నివేదిక విశ్వసనీయతను మరింత బలోపేతం చేసింది.

రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే, తెలంగాణ స్థూల నమోదు నిష్పత్తి 46.6 శాతంతో దేశ సగటును అధిగమించి అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. ప్రతి లక్ష మంది యువతకు 56 కళాశాలలతో కర్ణాటక తర్వాత రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలోని కళాశాలలలో, విద్యార్థుల నమోదులో సుమారు 85 శాతం ప్రైవేటు రంగం వాటా ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో 2021--22లో ఉన్నత విద్య నమోదు 19.29 లక్షలకు చేరి దేశంలో 11వ స్థానంలో నిలిచింది. అలాగే, ఉన్నత విద్యా సంస్థలకు ఏఐఎస్‌హెచ్‌ఈ గుర్తింపు సంఖ్యను తప్పనిసరి చేయడం ద్వారా గణాంకాల నాణ్యత, పారదర్శకతను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది.

ఏఐఎస్‌హెచ్‌ఈ 2023--24 నివేదిక భారత ఉన్నత విద్యలో చేరికలు, మహిళల సాధికారత, సామాజిక సమానత్వం, విజ్ఞాన శాస్త్ర--సాంకేతిక విద్య అభివృద్ధి వంటి అంశాల్లో దేశం సరైన దిశగా పురోగమిస్తున్నట్లు స్పష్టం చేస్తోంది. అయితే, స్నాతకోత్తర విద్యలో నమోదు పెంపు, ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల బలోపేతం, విద్యా నాణ్యత మెరుగుదల, పరిశోధన, నవకల్పన, నైపుణ్యాభివృద్ధిపై మరింత దృష్టి అవసరం. ఈ నివేదికలోని ప్రధాన అంశాలు---మొత్తం నమోదు 4.50 కోట్లు, స్థూల నమోదు నిష్పత్తి 30 శాతం, లింగ సమానత్వ సూచీ 1.08, షెడ్యూల్డ్ కులాలు--షెడ్యూల్డ్ తెగలు--ఇతర వెనుకబడిన తరగతుల విద్యార్థుల పెరుగుతున్న భాగస్వామ్యం, విజ్ఞాన శాస్త్ర--సాంకేతిక విద్యలో మహిళల 44 శాతం వాటా, తెలంగాణ అత్యుత్తమ స్థూల నమోదు నిష్పత్తి, ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న నమోదు---భారత ఉన్నత విద్య సమగ్రత, సమానత్వం, నాణ్యత దిశగా ముందుకు సాగుతోందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

# గోదావరి ఉగ్రరూపం.. ధవళేశ్వరం వద్ద తొలి ప్రమాద హెచ్చరిక





**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు1:ఎగువ గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో భద్రాచలం మీదుగా ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కు ప్రవాహం వేగంగా పెరిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ధవళేశ్వరం వద్ద తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం బ్యారేజ్‌లోని 175 గేట్లను ఎత్తి 10,06,819 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టా కాలువలకు 8,500 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.గేజ్ లెవెల్: 13.00 పాండ్ లెవెల్: 14.63 మీటర్లు

కాలువలకు విడుదల: 8,400 క్యూసెక్కులు

సముద్రంలోకి విడుదల: 11,46,033క్యూసెక్కులు

ఎత్తిన గేట్లు: 175,ట్రెండ్: పెరుగుతోంది

తొలి ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో గోదావరి తీరంలోని లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను దశలవారీగా పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వరద నీరు రహదారులపైకి చేరడంతో పలు లంక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, పోలీసు, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా సహాయక చర్యలను ముమ్మరం చేశారు.గోదావరి వరదల నేపథ్యంలో రాజమహేంద్రవరం అర్బన్ మండలంలోని ఎసి గార్డెన్స్ మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రస్తుతం 90 కుటుంబాలకు చెందిన 210 మంది ఆశ్రయం పొందుతున్నారు. శనివారం ఉదయం బాధితులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో ఆర్. శివరాముడు పరిశీలించి, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్బన్ తహసీల్దార్ రంజిత్ కుమార్ తదితర అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.ఇదిలా ఉండగా, బొబ్బిలిలంక--ములకలంక గ్రామాల మధ్య పడవ సేవలను అధికారులు తిరిగి ప్రారంభించారు. తొలి ప్రయాణం సురక్షితంగా పూర్తయిందని, ప్రస్తుతం వరద పరిస్థితులు పడవ రాకపోకలకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున గోదావరిలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు నది వద్దకు వెళ్లకుండా, వరద ప్రవాహాన్ని చూసేందుకు గుంపులుగా చేరకుండా, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.



# మొదటి రోజే పెన్షన్ పంపిణి కూటమి లక్ష్యం

**తొట్టంబేడు, (జయ జయహే)**

మండలంలోని పిల్లమేడు గ్రామం లో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు.ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి చేతులకు పింఛన్ డబ్బులను అందించారు. పింఛన్ పంపిణీ అనంతరం గ్రామంలోని ప్రజా సమస్యలను, తాగునీరు, రోడ్లు వంటి వసతుల గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, మరియు కూటమి నాయకులు,సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మహిళ మిస్సింగ్ కేసులను చేదించిన అనకాపల్లి పోలీసులు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లిలో వేర్వేరు మిస్సింగ్ కేసులో ఇద్దరు వివాహిత మహిళలను రక్షించిన అనకాపల్లి పట్టణ పోలీసులు దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనకాపల్లి టౌన్ పోలీసులు ప్రత్యేక బృందాలతో సమర్థవంతంగా పనిచేసే వేర్వేరు కేసుల్లో మిస్సింగ్ అయిన ఇద్దరు వివాహిత మహిళలు ను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వారి ఆదేశాల మేరకు టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ వారి బృందం ఆధ్వర్యంలో ఈ కేసును చేదించడం జరిగింది బి ఆర్టీ కాలనీకి చెందిన ఈనెల జూన్ 23న ఈ మహిళ ఇంటి నుండి వెళ్లినట్టుగా బెంగళూరులో ఉన్నట్టుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు గుర్తించి అనకాపల్లి పోలీసు బృందం బెంగళూరు వెళ్లి ఆమెను సురక్షితంగా అనకాపల్లి తీసుకురావడం జరిగింది ఆమె కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లడానికి నిరాకరించడంతో అనకాపల్లి వన్ స్టాప్ సెంటర్ కు సురక్షితంగా అప్పగించడం జరిగింది అలాగే మరొక మహిళ జూలై 23న మూత్రాశి కాలనీకి చెందిన వివాహిత మహిళ కనబడటం లేదని వచ్చిన ఫిర్యాదు అందిన వెంటనే కేవలం రోజుల వ్యవధిలోనే దర్యాప్తుని వేగవంతం చేసి సదర మహిళా హైదరాబాదులో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించి పోలీసు బృందం అక్కడికి వెళ్లి ఆమని తీసుకురావడం జరిగింది. పోలీసులు ఈ వివాహ మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించి నా అనంతరం కుటుంబ సభ్యులతో వెళ్లేందుకు నిరాకరించడంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం వన్ స్టాప్ సెంటర్ కు సురక్షితంగా వారికి అప్పగించడం జరిగింది బాధితుల కుటుంబాల ఆవేదనను అర్థం చేసుకొని సమయానుకూలంగా స్పందించి రెండు కేసులను చాకచక్యంగా చేదించిన అనకాపల్లి టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ మరియు వారి ప్రత్యేక పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వీరిని అభినందించడం జరిగింది. ముఖ్యంగా మహిళల రక్షణ జిల్లా పోలీసుల ప్రధమ కర్తవ్యం బాధితులకు తక్షణ న్యాయం రక్షణ కల్పించడంలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని వారు పేర్కొన్నారు




# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం

**బుచ్చియ్య పేట జయ జయహే**

పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటిటీకా అని ఐ సి డి ఎస్ సూపర్వైజర్ నిర్మల అన్నారు. ఐసిడిఎస్ పిఓ మంగతాయారు ఆదేశాల మేరకు శనివారం బుచ్చయ్య పేట మండలం పెద్ద మదిన మంగళాపురం పడ్డాది లోపూడి 2 ఎల్ బి పి అగ్రహారం అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ నిర్మల మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు అంగన్వాడి పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి ర్యాలీలు నిర్వహించి బాలింతలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టడం వలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డ రోగ నిరోధక శక్తిని పెంపొందించుకుంటారని అన్నారు. శిశువుకి జన్మనిచ్చిన తల్లికి రోజుకి 750 మిల్లీలీటర్ల తల్లిపాలు ఉత్పత్తి అవుతాయని అన్నారు. పుట్టిన బిడ్డకు క్రమం తప్పకుండా 100 మిల్లీలీటర్లు తల్లిపాలు ఇవ్వడం వలన 70 కిలో క్యాలరీలు పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు వెంకటలక్ష్మి భాను. వేణు అమ్మాజీ . కె జ్యోతి సత్య. రాధా లక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.



# వరసిద్ధునికి వెండి ఆభరణాలు వితరణ

**పూతలపట్టు, ఆగస్టు 01,జయ జయహే**

స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి కి 12 కిలోల వెండి ఆభరణాలను శనివారం దాత సూర్య ప్రకాష్ కుటుంబ సభ్యులు దేవస్థానం ఈవో పెంచల కిషోర్ చైర్మన్ మణి నాయుడు చేతుల మీదగా అందజేశారు. వాటి విలువ రూ -/38,00,000/-లక్షల రూపాయలు ఉంటుందని అంచనా.వినాయక స్వామి వారికి వెండి కవచాలు విరాళం (సర్వాంగ కవచం, తొండము, హస్తాలు, చెవులు,) అందజేశారు.వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని ఈ.వో పెంచల కిషోర్, దేవస్థానం చైర్మన్ మణి నాయుడులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ధనపాల్, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# శాస్త్రోక్తంగా సహస్రగట్టాభిషేకం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 01,జయ జయహే**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం లో శనివారం సహస్రగట్టాభిషేకం మృత్యుంజయ స్వామికి శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కొట్టె సాయి,ఈఓ, ఆలయ అధికారులు,సభ్యులు పాల్గొన్నారు.



# కొయ్యురులో మండల సర్వసభ్య సమావేశం

## అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి..

## కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్..

**కొయ్యురు : (జయ జయహే)న్యూస్ ఆగష్టు 02,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల లో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కొయ్యూరు మండల అభివృద్ధికి కృషి చేయాలని, అధికారులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఎంపీపీ బడుగు రమేష్ సూచించారు. ప్రజాప్రతినిధులుగా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రహదారుల నిర్మాణానికి కృషి చేయాలని ఎంపీపీ రమేష్ కోరారు.



# గిరిజన విద్యార్థులకు సువర్ణ అవకాశం

## కొయ్యూరు ఏకలవ్య స్కూల్ లో ఓపెన్ స్కూల్, సైనిక విద్యాపీఠం ప్రవేశాలు

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 02,**

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలురు)కొయ్యూరు-1 పాఠశాల లో 2026-2027 విద్యా సంవత్సరం నుండి సైనిక విద్యాపీఠం మరియు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పదవ తరగతి, ఇంటర్ ఆర్ట్స్ గ్రూప్, ఎహ్ ఇ సీ, సీ.ఈ.సీ,అడ్మిషన్ల ప్రవేశాలు మొదలయ్యాయి. పదవ తరగతి 100 సీట్లు, ఇంటర్ 40 సీట్లు కేటాయించడం జరిగింది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జస్ట్ర. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేంద్రానికి సంబంధించి కార్యదర్శిగా జస్ట్ర. శ్రీనివాసరావు, కార్డినేటర్‌గా వీ. అప్పలనాయుడు,అసిస్టెంట్ కోఆర్డినేటర్ జె.వి.ఎస్. గణబాబు వ్యవహరిస్తున్నారు.సంప్రదించవలసిన నెంబర్లు:9490679505, 9491786834, 7702024994, సైనిక విద్యాపీఠం ద్వారా మల్టీపుల్ అడ్మిషన్, పదవ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్, రెగ్యులర్ ఇతర పదవ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లతో నిరాసక్తంగా ఉద్యోగాలు 5,8 మరియు 2వ తరగతి పరీక్షలకు సమాన గుర్తింపు కలిగి ఉంటుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.



# సొంత నిధులతో మరుగుదొడ్లు పూర్తి చేస్తాం

## దొండా నరేష్

**బుచ్చియ్య పేట జయ జయహే**

వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత పాలకుల నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాన్ని 'మన ఊరు--మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా సొంత నిధులతో పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తామని వడ్డాది పీఏసీఎస్ చైర్మన్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ అన్నారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతుండడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, అనకాపల్లి పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆదేశాల మేరకు శనివారం స్థానిక నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నరేష్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నకళతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ముఖ్యంగా బాలురు కాలకృత్యాల కోసం రోడ్డు దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమన్నారు.ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని నరేష్ విమర్శించారు. అధికారులు అప్పటి నాయకులు తమ బాధ్యతను నిర్వర్తించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. వారి నిర్లక్ష్యం వల్లే మేము సొంత నిధులతో ముందుకు రావాల్సి వచ్చింది. పిల్లల భవిష్యత్తు కోసం ఎంత ఖర్చయినా వెనుకాడమని అవసరమైతే పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని అని స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలో మిగిలిన మౌలిక సదుపాయాల పనులను పూర్తిచేయాలని, లేకపోతే ఈ అంశాన్ని ఉన్నతాధికారులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నకళ, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరదల కారణంగా ప్రాణ, ఆస్థి నష్టం కలగకుండా చూడాలి





### ముంపు గ్రామాలవారిని పునరావాస కేంద్రాలకు తరలించాలి

### అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

**ఏలూరు/వేలేరుపాడు, జయ జయహే**

జిల్లాలో వరదల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వరద పరిస్థితి, పునరావాస చర్యలపై జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి లతో కలిసి అధికారులతో వరద పరిస్థితి ని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గోదావరి వరదలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 28 గ్రామాలలోని 8492 మంది ప్రజలపై ప్రభావం చూపాయన్నారు. ముంపు గ్రామాలలోని ప్రజలందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ముంపు ప్రమాదం ఉన్న గ్రామాలలోని ప్రజలను వరద పునరావాస కేంద్రాలకు తరలించి భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని అన్నారు. కుక్కునూరు మండలంలో ఒకటి, వేలేరుపాడు మండలంలో ఒక వరద పునరావాస కేంద్రం ఏర్పాటుచేయడంచేశారు. కేంద్ర విపత్తు నివారణ దళానికి చెందిన 25 మంది సభ్యులతో కూడిన బృందాన్ని వేలేరుపాడు మండలానికి, రాష్ట్ర విపత్తు నివారణ దళానికి చెందిన 25 మంది సభ్యులతో కూడిన బృందాన్ని కుక్కునూరు కు పంపి ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు మండలాలకు సంబంధించి 15 బొట్లు, 2 లాంచీలు, గజ ఈతగాళ్లని సహాయక కార్యక్రమాలకు సిద్ధం చేయడంచేశాం అని కలెక్టర్ తెలిపారు. వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. . పునరావాస కేంద్రాలకు 44 కుటుంబాలను తరలించామని వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలనిఆదేశించారు పునరావాస కేంద్రాలు, ముంపు గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని, గర్భిణీలను దగ్గరలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలకు తలరించాలన్నారు. వయోవృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిని దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలన్నారు. వైద్య కేంద్రాలలో మలేరియా, టైఫాయిడ్, డయేరియా, పాము కాటు నివారణ మందులను సిద్ధం ఉంచాలన్నారు. వరద ముంపు తొలగే వరకు అధికారులు వరద సహాయక విధులలో సక్రమంగా నిర్వహించాలన్నారు.ఆమెతో పాటు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ, డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ డా. శోభ, తహసీల్దార్ ఎన్ . శ్రీనివాస్, ప్రభృతులు పాల్గొన్నారు.







# గణేష్ హత్య కేసు ఛేదన

### ముగ్గురు నిందితుల అరెస్ట్

**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు1: ఇన్నీసుపేటలో ఎర్రా గణేష్ అలియాస్ గంజిగాడు హత్య కేసును రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసులు ఛేదించారు. కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన బటన్ కత్తి, రక్తపు మరకలున్న రెండు టీ-షర్టులు, మొబైల్ ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.జూలై 28న ఇన్నీసుపేట దుక్కలదొడ్డి ప్రాంతంలో ఎర్రా గణేష్‌పై మారణాయుధాలతో దాడి చేసి హత్య చేసిన ఘటనపై మృతుడి మామ దేవాడ సూర్యప్రకాశ్ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.సౌత్ సెంట్రల్ డిఎస్పీ శివప్రియ ఆదేశాల మేరకు రెండో పట్టణ సిఐ శివ గణేష్, ధవళేశ్వరం సిఐ టి. గణేష్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జూలై 31న ధోబీఘాట్ శివాలయం వద్ద వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నారు.దర్యాప్తులో గుట్కా, సమోసా వ్యాపారంలో ఏర్పడిన ఆర్థిక వివాదాలు, డబ్బుల లావాదేవీలు, వ్యాపార ఆధిపత్యం కారణంగానే హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. గణేష్‌ను హత్య చేస్తే తామే వ్యాపారం కొనసాగించవచ్చనే ఉద్దేశంతో ముగ్గురు కలిసి జాతర సందర్భంగా కాపుకాసి మారణాయుధాలతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.పాల చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ చంటి,పిట్టా లోకేష్ కుమార్ అలియాస్ లోకి,గంటా తేజ సత్యదుర్గ అలియాస్ టైసన్,రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచామని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ శివ గణేష్ కోరారు. కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ అభినందించారు.డి ఎస్పీ శివప్రియ రెండో పట్టణ సిఐ శివ గణేష్ ధవళేశ్వరం సిఐ టి. గణేష్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది దర్యాప్తులో పాల్గొన్నారు

# గిరిజన సంస్కృతితో రికార్డులు

### హక్కుల సంగతి ఏమిటి?...

### -గిరిజనుల హక్కులను పరిరక్షించాలి

### జి.ఓ. నెం.3 పునరుద్ధరణతో గిరిజనుల ఋణం తీర్చుకోవాలి.. సుజాత సల్మాన్

**అరకులోయ. ఆగష్టు 1. జయ జయహే.**




నిన్న జరిగిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సహా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గిరిజన విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారని సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ పేర్కొన్నారు. ఇటీవల అరకు వ్యాలీలో దింసా నృత్యంతో ప్రపంచ రికార్డు సాధించడం, గతంలో ప్రపంచ యోగా దినోత్సవం, అరకు ఉత్సవాలు, నిన్న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం వంటి ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో గిరిజన కళాకారులు, విద్యార్థులు తమ సంప్రదాయ దింసా నృత్యంతో రాష్ట్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తూ విశేషంగా శ్రమించారని ఆమె అన్నారు. అయితే, ప్రపంచానికి గిరిజన సంస్కృతిని చాటిచెబుతున్న అదే గిరిజనుల హక్కులు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల భూములు, జీవన హక్కులను పరిరక్షించే జి.ఓ. నెం.3 పునరుద్ధరణతో పాటు 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని గిరిజనులు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ తగిన న్యాయం జరగడం లేదని విమర్శించారు. ప్రపంచ రికార్డులు, ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేందుకు గిరిజనుల కృషిని వినియోగించుకుంటున్న ప్రభుత్వం, అదే స్థాయిలో వారి హక్కుల పరిరక్షణకు కూడా చొరవ చూపాలని ఆమె డిమాండ్ చేశారు. జి.ఓ. నెం.3 పునరుద్ధరణ, 1/70 చట్టం అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ, గిరిజనుల సహకారంతో గుర్తింపు పొందుతున్న ప్రభుత్వం వారి సమస్యలను విస్మరిస్తే భవిష్యత్తులో ఆ అసంతృప్తి ఉద్యమాల రూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

# విద్య ద్వారా భారత్ ఆస్ట్రేలియా భాగస్వామ్యం బలోపేతం





### - ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య శిక్షణ శాఖ సహాయ మంత్రి జూలియన్ హిల్

### - యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా వివెన్స్ గ్రూప్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం

**విజయవాడ, ఆగష్టు 1, జయ జయహే**

ఆస్ట్రేలియాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా వివెన్స్ గ్రూప్‌తో కలిసి విద్య పరిశోధన, ఆవిష్కరణలు, వృత్తిపరమైన అభివృద్ధి, పరిశ్రమల సహకార రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టేందుకు ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య మరియు శిక్షణ శాఖ సహాయ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు జూలియన్ హిల్ స్వయంగా విజయవాడకు రావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శనివారం విజయవాడలోని నోవోటెల్ వరుణ్ హోటల్లో నిర్వహించిన స్ట్రాటజిక్ పార్ట్నర్ షిప్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య మరియు శిక్షణ శాఖ సహాయ మంత్రి జూలియన్ హిల్ మాట్లాడుతూ విద్య, ఆవిష్కరణలు, ప్రజల మధ్య సంబంధాల ఆధారంగా ఆస్ట్రేలియా-భారత్ భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, వివెన్స్ గ్రూప్ మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. భారతదేశంలో యనివర్శిటీ చేస్తున్న పెట్టుబడులు, వివెన్స్ గ్రూప్ తో కలిసి చేపడుతున్న కార్యక్రమాలు రెండు దేశాల మధ్య సంబంధాలకు కొత్త దిశను చూపుతాయన్నారు. వీవెన్స్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు అర్జున్ సురపనేని మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి విద్యా, పరిశోధన, ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యంతో ఈ అవగాహన ఒప్పందం కుదిరిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల విద్యను స్థానిక అవసరాలకు అనుగుణంగా అందిస్తూ, భవిష్యత్తు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం సలహాదారు రవి వేమూరు, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా డిప్యూటీ వైస్ చాన్సలర్ (గ్లోబల్ ఎంగేజ్ మెంట్) ప్రొఫెసర్ జెన్నిఫర్ హటరీవెల్, హెచఎసీఎల్ టెక్ సీనియర్ క్యాపబిలిటీ లీడర్ సురేష్ బాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, వివెన్స్ గ్రూపు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



## ఘనంగా ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 01,జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కర్‌పేట, బాబుగ్రహారం మునిసిపల్ ఉన్నత పాఠశాలలు, తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు స్కార్ఫ్‌లు ధరించి ఉత్సాహంగా పాల్గొని స్కౌటింగ్ సేవా స్ఫూర్తిని చాటిచెప్పారు.భాస్కర్‌పేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1907 ఆగస్టులో బ్రౌన్‌సీ ద్వీపంలో నిర్వహించిన తొలి స్కౌట్ శిబిరం జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఆగస్టు 1న ప్రపంచ స్కౌట్ స్కార్ఫ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమాల్లో తొండమనాడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి. కృష్ణయ్య, భాస్కర్‌పేట పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, బాబుగ్రహారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి, స్కౌట్ మాస్టర్ జయసింహ, గైడ్ కెప్టెన్లు పి. పద్మావతి, పావని, యోగానందం, వెంకటాద్రి, మురళి, గైడ్ కెప్టెన్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న సుధాకర్ నాయుడు

**జయ జయహే**



మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు యం సుధాకర్ నాయుడు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలోపాల్గొన్నారు. బుచ్చినాయుడు కండ్రిగమండలం, బుచ్చినాయుడు కండ్రగ గ్రామంలో, అరుంధతి వాడలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వికలాంగ, వృద్ధాప్య, వితంతు పింఛెలను ఇచ్చి వారితో మంచిగా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకొని నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల గురించి ప్రస్తావిస్తూ గతంలో 2000 రూపాయలు ఇస్తున్నది 4000 రూపాయలు ఇచ్చిన సందర్భాన్ని గుర్తుచేస్తూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై మునయ్య నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు వై సురేంద్ర బాబు యూనిట్ ఇంచార్జ్ సునీల్ పంచాయతీ కార్యాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ అడ్మిన్షన్స్‌లో జీవో నంబర్ 102 నష్టాదాయకం

### డా ॥ ఆలా వెంకటేశ్వర్లు

**గుంటూరు (జయ జయహే)**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జులై 30వ తేదీన విడుదల చేసిన జీవో నెం 102, 2026 నీట్ పరీక్షలో ర్యాంకులు సాధించిన ఎంబిబిఎస్ విద్యార్థులు ఆల్ ఆప్షన్స్ పెట్టుకోవడం కంపల్సరీ చేయకపోవడం వలన విద్యార్థులు నష్టపోతారని గతంలో ఉన్న 151 జీవో ను అమలుపరిచాలని కోరారు. ఈ నెల 1వ తేదీన గుంటూరు లోని జన చైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో డా ॥ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ 102 జీవో ను అమలు చేస్తే విద్యార్థులు ఆల్ ఆప్షన్స్ కంపల్సరిగా పెట్టుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని తత్ఫలితంగా రిజర్వేషన్లు పొందిన విద్యార్థులు ఓపెన్ క్యాటగిరిలో సీటు వచ్చే అవకాశాన్ని వినియోగించుకోవడాన్ని కోల్పోయి రిజర్వేషన్ కేటగిరీలో సీటు పొందితే తత్ఫలితంగా రిజర్వేషన్ కేటగిరి విద్యార్థులు వారి వారి సీట్లను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక 102 జీవోను రద్దు చేసి గతంలో మెడికల్ విద్యార్థులందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న 151 జీవోను కొనసాగించాలని కోరారు. ఈ మేరకు విజ్ఞప్తి చేస్తూ రాష్ట్రమెడికల్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ కు విజ్ఞప్తిని అందించినామని తెలిపారు. గతంలో మెడికల్ అడ్మిషన్స్ లో ఉన్న లోపాలను సవరించడానికి హైకోర్టు 2019లో ఇచ్చిన ఉత్తర్వులు ఆధారంగా ఆరుగురు నిపుణులతో కమిటీ వేశారని, వారి నివేదిక ఆధారంగా 151 జీవో అమల్లోకి వచ్చి ఎలాంటి సమస్యలు లేకుండా కొనసాగుతుండగా నేడు 102 జీవోను అమలు చేస్తే అనేక సమస్యలు ఉత్పన్నమౌతాయని, రిజర్వేషన్ కేటగిరి విద్యార్థులు నష్టపోతారన్నారు. విద్యార్థులు అందరూ అన్ని ఆప్షన్లను పెట్టుకోవడం కంపల్సరీ చేయాలని కోరారు. 2వ, 3వ కౌన్సిల్ ఆప్షన్స్ మార్చుకునే అవకాశం కల్పించాలన్నారు.

# లోకమాన్య బాల గంగాధర్ విగ్రహావిష్కరణ

**అనకాపల్లి (జయ జయహే)**

లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 64,వ వర్ధంతి సందర్భంగాఅనకాపల్లి లో జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్ ఆవరణంలో అబ్దుల్ కలాం సేవా సంఘం చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ విగ్రహాన్ని సంఘ సేవకులు మళ్ళ జగ్గప్పారావు, శిలపరశెట్టి ప్రసాద్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేశారు అనంతరం, మళ్ళ జగ్గప్పారావు, శిల్పపర శెట్టి ప్రసాద్, అనకాపల్లి జిల్లా మోనిటరింగ్ కమిటీ మాజీ మెశీబర్ రేభాక మధుబాబు, ప్రధాన ఉపాధ్యాయురాలు రుద్ర రాణి, ఉపాధ్యాయులు, సూర్య కృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు,అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,అబ్దుల్ కలాం సేవా సంఘశీ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వాళ్ళను గడగడ లాడించి, ఆ రోజుల్లో బ్రిటిష్ వారిని తరిమికొట్టాలంటే వినాయక చవితి మండపాలను ఏర్పాటు, బ్రిటిష్ వారిని ఏ విధంగా తరిమికొట్టాలి, బ్రిటిష్ వారిని కోసం వినాయక చవితి మండపంలో ఏర్పాటు చేస్తూ, ప్రతి ఒక్కరు కూడా మాట్లాడుకోవాలి అని సందర్భం వస్తే కేవలం వినాయక చవితి మండపాలలోనే మాట్లాడుకోవడం జరిగేది.



ఈ సందర్భంగా బాలగంగాధర్ తిలక్ గుర్తు చేసుకోవడం జరిగింది, ఇలాంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాలని యువత భవిత అంతా కూడా స్వతంత్ర సమర వీరుల ఆలోచనలను వాళ్ళు ఏ విధంగా స్మరించుకుంటున్నాం అన్న విషయాలపై అవగాహన కల్పించుకోవాలని ప్రతి ఒక్కరిలో విద్య నైపుణ్యం కనబడుచుకోవాలని ఉన్నతమైన స్థానంలో ఉండాలని సందర్భంగా విద్యార్థులు సూచించారు.



## భోగాపురం బయిలుదేరిన బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు

**చోడవరం ,ఆగస్టు 1, జయ జయహే**

రాష్ట్ర అభివృద్ధికి మరో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచే భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్న పార్టీ నాయకులు, కార్యకర్తలను తీసుకెళ్లే బస్సులను శనివారం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు జెండా ఊపి ప్రారంభించారు. చోడవరం, బుచ్చయ్యపేట మండలాల నుండి సుమారు 60 బస్సుల్లో 5000 మందికి పైగా కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రధాని సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గ పరిశీలకులు గాయత్రి, పార్టీ ముఖ్య నాయకులు గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, యువ నాయకులు సకురు కోటేశ్వరరావు నౌడు సుధాకర్ రావు నాయుడు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్షమాపణలు కాదు... కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

### ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు

**జయ జయహే:**

విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?' అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబిıబబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.



## భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవానికి బయల్దేరిన కొణతాల అభిమానం బృందం

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక రింగ్ రోడ్డు డ్డు జనసేన పార్టీ కార్యాలయం నుండి శనివారం స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళా మనలో ప్రత్యేక బస్సులో భోగాపురం లో జరుగు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం చేయబోయే అంతర్జాతీయ ఎయిర్పోర్ట్ కు తరలి వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర బి ఎస్ ఎం కె జోగి నాయుడు కూటమి కార్యకర్తలు నాయకులు తరలి వెళ్ళడం జరిగింది





## ప్రభుత్వ పాఠశాలలో పేపర్ డే వేడుకలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

పేపర్ డే సందర్భంగా నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. పేపర్ వినియోగం, దాని ప్రాధాన్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలోని విద్యార్థులందరికీ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పూజిత పేపర్ ప్రోడక్ట్స్‌కు చెందిన కోట్ల సత్యనారాయణ మూర్తి, నిడదవోలు పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి మానేపల్లి నాగేశ్వరావు, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు ఆలమూరి రాజశేఖర్, రోటరీ క్లబ్ మాజీ సెక్రటరీ ఫయాజ్ అహ్మద్, వాసవి క్లబ్ మాజీ కోశాధికారి చక్కా రవికుమార్, వాసవి క్లబ్ మాజీ వైస్ చైర్మన్ చెన్న మహేష్ బాబు, రాజా ప్రింటింగ్ ప్రెస్ ప్రతినిధులు, రాజరాజేశ్వరి హైస్కూల్ అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తూ పుస్తకాలు అందజేసిన నిర్వాహకులకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# స్ఫూర్తి ట్రస్ట్‌లో పుట్టినరోజు ఘనంగా పుట్టినరోజు వేడుకలు





### దివ్యాంగురాలికి వీల్‌చైర్, వృద్ధులకు అన్నదానం

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్ట్ 1:**

ధవళేశ్వరం సమాజ సేవే నిజమైన పుట్టినరోజు వేడుక అనే సందేశాన్ని చాటుతూ డ్రీమ్స్ స్కూల్స్ అధినేత డాక్టర్ అంగర్ రమేష్ తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాల మధ్య ఘనంగాజరుపుకున్నారు. ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం హృదయాలను హత్తుకుంది.ఈ సందర్భంగా డాక్టర్ అంగర్ రమేష్ కేక్ కట్ చేసి వృద్ధులు, దివ్యాంగులు, నిరాశ్రయులకు భోజనాలు అందజేశారు. అలాగే దివ్యాంగురాలు సంపంగి సుజాతకు వీల్‌చైర్‌ను అందించి ఆమెకు అండగా నిలిచారు. అంగర్ రమేష్ మాట్లాడుతూ, "పుట్టినరోజు అంటే కేవలం సంబరాలు కాదు... అవసరంలో ఉన్నవారి ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడం నిజమైన ఆనందం. వృద్ధులు, దివ్యాంగులు, నిరాశ్రయులకు చేయూతనివ్వడం ద్వారా లభించే తృప్తి ఏ వేడుకకూ సాటి కాదు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు నా వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుంది. సమాజం కోసం పనిచేసే ప్రతి సేవా సంస్థకు నా మద్దతు ఉంటుంది" అని పేర్కొన్నారు.ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ మాట్లాడుతూ, "మంచి వ్యక్తిత్వం, సేవాభావం కలిగిన డాక్టర్ అంగర్ రమేష్ పుట్టినరోజును మా ట్రస్ట్‌లో నిర్వహించడం ఆనందంగా ఉంది. ఆయన జన్మదినం సందర్భంగా దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందించడం ఆయన మానవతా దృక్పథానికి నిదర్శనం. సమాజానికి సేవ చేసే ఇలాంటి వ్యక్తులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె వి ఆర్ సాగర్, దుర్గ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొని డాక్టర్ అంగర్ రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



## వాసవి మాత ఆలయానికి లక్ష విరాళం

**మాడుగుల ఆగస్టు1 జయ జయహే**

మాడుగుల మండలం ఎంకోడూరు గ్రామంలో గల శ్రీ మోదకొండమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి మాడుగుల మండలం కాశీ పురానికి చెందిన మేడిశెట్టి జగన్నాథ స్వామి, వెంకటరత్నం, మణికంఠ, శ్రీ కన్య, సహస్ర, అన్వార్ లు కలిపి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి సంజీవరావుకు వాసవి కమిటీ చైర్మన్ అనపగడ్డి శ్రీనివాసరావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రావాలా కాంతారావు, నానాజీ శాఖ విశ్వేశ్వరరావు, బుచ్చిబాబు, రావల మోహనరావు, శివ, పుట్టా రమణబాబు, ఉడత గుప్తాజీ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్‌లో రైతు కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి

**మాడుగుల ఆగస్టు1 జయ జయహే**



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నూతన స్టీల్ ప్లాంటులో రైతుల కుటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం చేసే విధంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాతీయ రైతు పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఆడారి కన్నారావు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధిలో భాగంగా సుమారు 1,000 ( వెయ్యి) ఎకరాలులో 50 వేలు కోట్లు రూపాయలు తోని అనకాపల్లి జిల్లాలోని మాకవరపాలెం మండలంలో గల పైడిపాల, పెద్దిపాలెం, బూరుగు పాలెం, తూటిపాల, అడిగర్ల పాలెం, మామిడిపాలెం గ్రామాల్లో గల భూములు కోల్పోయిన ప్రతీ రైతు కుటుంబాలకు ఇంటి కొక ఉద్యోగం ఇచ్చి ప్రభుత్వం భద్రత కల్పించాలన్నారు. ఆయా జిల్లా పరిధిలోని యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేయాలన్నారు. మహిళా రైతులుకి వారి అర్హతలను బట్టి ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఆయా ప్లాంట్ నిమిత్తం భూములు కోల్పోయిన బాధితులుకి పరిహారం, పునరావాసం మరియు ఆయా కుటుంబాలకు భద్రత కల్పించాలన్నారు. ఈ ప్రాంతంలో ప్లాంట్ స్థాపించడం వలన వెనుక బడిన అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే గాకుండా ఈ ప్లాంట్ నిర్మాణం వలన జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గల నిరుద్యోగులకు మహిళలుకి కొంత భరోసా మరియు భద్రత ఏర్పడుతుందని కన్నారావు ఆశాభావం వ్యక్తం చేశారు .

## గోదావరి ఉద్ధృతిపై హై అలర్ట్

### లోతట్టు ప్రజలు అప్రమత్తం -- అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలింపు

**ధవళేశ్వరం: జయ జయహే:**



ఆగస్టు 1:భద్రాచలంలో గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ధవళేశ్వరం సిఐ గణేష్ మాట్లాడుతూ, గోదావరి నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అవసరమైతే ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఎవరూ నది ఒడ్డుకు వెళ్లకూడదని, పిల్లలను నీటి సమీపంలోకి అనుమతించవద్దని, చేపల వేట, పడవ ప్రయాణాలు పూర్తిగా నిలిపివేయాలని సూచించారు.రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖలు పరస్పర సమన్వయంతో వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారులను లేదా అత్యవసర సేవలను వెంటనే సంప్రదించాలని ఎస్పీ సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.



## బేబీ క్యారెట్స్ సీక్రెట్

బేబీ క్యారెట్లు గురించి తెలియని వారుండరు. ఇది తినేందుకు కూడా రుచిగా ఉంటాయి. ముఖ్యంగా సాధారణ క్యారెట్స్ కంటే ఈ బేబీ క్యారెట్లు తింటే ఎన్నో లాభాలు పొందొగలమని అమెరికా పరిశోధకులు జరిపిన తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. అందం, ఆరోగ్యానికి కేరాఫ్ అడ్రస్ బేబీ క్యారెట్లని తేల్చి చెబుతున్నారు. అంత మేలు చేసే ఈ బేబీ క్యారెట్లను చిరుతిండిగా తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, అధ్యయనంలో వెల్లడైన ఆసక్తికర విషయాలు తదితరాల గురించి సవివరంగా తెలుసుకుందామా..!

శాకాహార ప్రియులకు బెస్ట్ స్నాక్ ఐటెంగా తీసుకునే కాయగూర బేబీ క్యారెట్లు. వీటిని స్నాక్ రూపంలో మరేదైన విధంగా తీసుకోవడం చాలా మంచిది. క్రమం తప్పకుండా తీసుకుంటే చర్మానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. వారానికి మూడుసార్లు తీసుకుంటే చర్మ కెరోటినాయిడ్లు గణనీయంగా పెరుగుతాయని పరిశోధనలో తేలింది. ఈ కెరోటినాయిడ్లు శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు.

ఇవి చర్మంలోని ఫ్రీ రాడికల్స్‌ని తగ్గించగలవు. ఆక్సీకరణ ఒత్తిడికి వ్యతిరేకంగా పనిచేస్తాయి. దీర్ఘకాలికి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మెరుగైన చర్మం, రోగనిరోధక వ్యవస్థ పనితీరుని మెరుగ్గా ఉంచుతాయి. అధిక స్థాయి కెరోటినాయిడ్లు యాంటీ ఆక్సిడెంట్ రక్షణతో సంబంధం కలిగి ఉన్నాయని, ఇవి గుండె జబ్బులు, కేన్సర్‌ల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి పరిశోధకులు చెబుతున్నారు.

చర్మ ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందంటే..

చికాగోలో జరిగిన అమెరికన్ సొసైటీ ఫర్ న్యూట్రిషన్ చెందిన శాస్త్రవేత్తలు సుమారు 60 మంది యువకులపై అధ్యయనం నిర్వహించగా..స్కిన్ కెరోటినాయిడ్ స్కోర్‌లు గణనీయంగా 10.8% పెరిగినట్లు గుర్తించారు. సుమారు వందగ్రాములు బేబిక్యారెట్లు తీసుకుంటేనే మంచి ఫలితాలను చూపించిందని అన్నారు. దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి కూడా వివరించారు. అవేంటంటే..

దృష్టి లోపాన్ని మెరుగుపరుస్తుంది: చూపుని రక్షించడంలో సహాయపడుతుంది. వయస్సు సంబంధిత సమస్యల నుంచి కూడా రక్షిస్తుంది.

ఇది పిత్తస్రావాన్ని పెంచుతున్నట్లు పరిశోధనలో గుర్తించారు శాస్త్రవేత్తలు. ఇది కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

దంతాల ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. వృద్ధ జపనీస్ జనాభాలో దంతాల నష్టం రేటుని అధ్యయనం చేయగా బీటా కెరోటిన్ ఎక్కువగా తీసుకున్న వారిలో దంత సమస్యలు తగ్గినట్లు గుర్తించారు. అయితే బేబి క్యారెట్లు సాధారణ క్యారెట్లు కంటే తక్కువ రోజులే నిల్వ ఉంటాయి. రిఫ్రిజిరేటర్‌లో అయితే సుమారు నాలుగు వారాల పాటు నిల్వ చేయవచ్చు.

# ఆలూ బుఖారాతో బోలెడన్ని లాభాలు!





వర్షాకాలంలో వ్యాధుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆహార విషయానికొస్తే తగిన జాగ్రత్తలు ఎంతో ముఖ్యం. ఈ సీజన్‌లో ఆలూ బుఖారాతో కొన్ని ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. అవేంటో చూద్దాం.

ఆలూ బుఖారాలో విటమిన్ సి ప్రోటీన్ పుష్కలంగా దొరుకుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతూ, ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఈ పండు శక్తివంతమైన యాంటీయాక్సిడెంట్లను కలిగి ఉండటంతోపాటు ఈ వ్యాధులను కూడా నివారిస్తుంది.

### ఆలూ బుఖారాతో ప్రయోజనాలు..

ఆలూ బుఖారా జీర్ణవ్యవస్థ సమస్యలను తొలగించడంతోపాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. అలాగే కడుపు నొప్పి సమస్యలనుంచి ఉపశమనం పొందవచ్చు.

ఈ పండు తీపిగా ఉన్నప్పటికీ, మధుమేహ రోగులకు ప్రయోజనాన్నిస్తుంది. ఇది పీచు పదర్థంగా ఉంటూ, రక్తంలో అవసరమైనంత చక్కెర స్థాయినిస్తుంది. షుగర్ పేషెంట్లు కూడా ఆలూ బుఖారాను తక్కువ మోతాదులో తీసుకోవచ్చు.

ఎముకలు దృఢంగా మారడంలో ఆలూ బుకారా ఎంతో ఉపయోగకరం. ఎముకలు దెబ్బతినకుండా, ఎముకల వ్యాధి వంటి ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి కాపాడుతుంది.

అధిక రక్తపోటు నుంచి రక్షించడంతోపాటు, దీన్ని తినడంతో బీపీ, కొలెస్ట్రాల్ అదుపులో ఉంటాయి. ఇది గుండె సంబంధిత వ్యాధులను కూడా అరికడుతుంది.

విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు సమృద్ధిగా ఉండటంతో ఆలూ బుఖారా ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచడంలో ఎంతో తోడ్పడుతుంది. దీనిని తీసుకోవడంతో ఫిట్‌నెస్ కూడా మెరుగుపడుతుంది.

# వర్షాకాలంలో మెరిసే చర్మానికి...



వర్షాకాలంలో చర్మం జిగటగా మారుతుంది. కొన్నిసార్లు సూర్యరశ్మి, కొన్నిసార్లు తేమ, తేమతో కూడిన వర్షం చర్మంపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. మొటిమలు, మొటిమల సమస్యలు కూడా పెరుగుతాయి. అటువంటి సమయంలో చర్మంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరం. వర్షాకాలంలో మీ చర్మం మెరుపు చెక్కుచెదరకుండా ఉండటానికి ఎలా ప్రత్యేక శ్రద్ధ వహించాలో కొన్ని చిట్కాలు ఉన్నాయి. వర్షాకాలంలో చర్మం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. దీనివల్ల ముఖంపై పగుళ్లు, జిగట, దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. వర్షాకాలంలో మీ ముఖాన్ని, చర్మం మెరిసిపోయే రహస్యాన్ని గురించి ఇప్పుడు కొన్ని విషయాలు తెలుసుకుందాం.

### ముఖాన్ని శుభ్రం చేయటం ముఖ్యం:

వర్షాకాలంలో ముఖాన్ని శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. రోజుకు కనీసం రెండు సార్లు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ముఖం కడుక్కోవడానికి నీమ్‌ఫేస్ వాష్, గ్రీన్ టీ ఫేస్‌వాష్, టీ ట్రీ ఫేస్‌వాష్ ఉపయోగించడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

### రోజ్ వాటర్ :

రోజ్ వాటర్‌తో ముఖం సహజమైన మెరుపును కాపాడుకోవచ్చు. రోజ్ వాటర్ అనేది వర్షాకాలంలో ఉపయోగించడం మంచిదని భావించే టోనర్. ఈ సీజన్‌లో ఫేస్ క్రీమ్‌కు బదులుగా రోజ్ వాటర్‌ను ముఖానికి రాసుకోవడం మంచిది.

### నూనె:

చర్మం జిడ్డుగా ఉంటే డస్టింగ్ పౌడర్‌ను ఉపయోగించాలి. ఇలా చేయకపోతే చర్మంపై అదనపు నూనె చర్మ సమస్యలను పెంచుతుంది. కావున దీనిని దృష్టిలో ఉంచుకోవాలి.

### లైట్‌ఫేస్ ఆయిల్:

వర్షాకాలంలో చర్మానికి మాయిశ్చరైజర్‌ను మెయింటెయిన్ చేయడానికి.. లైట్‌ఫేస్ ఆయిల్‌ని ఎంచుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు, మొటిమలు వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అందువల్ల ఎల్లప్పుడూ తేలికపాటి నూనెను మాత్రమే వాడాలి.

### అలోవెరా:

వర్షాకాలంలో చర్మంలో దురద, చికాకును నివారించడానికి.. అలోవెరా జెల్‌ను ఉపయోగించి ఓదార్పు అనుభూతిని ఇవ్వడానికి, దానిని హైడ్రేట్‌గా ఉంచడానికి ఉపయోగించవచ్చు. కలబందలోని యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఈ సీజన్‌లో మీ చర్మానికి చాలా మేలు చేస్తాయి. మీకు కావాలంటే, మీరు కలబంద ఆకులను తీసి దాని నుండి తాజా జెల్‌ను తీసి నేరుగా చర్మానికి అప్లై చేసి 20-25 నిమిషాలు అలాగే ఉంచవచ్చు. తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి. చర్మం సహజమైన మెరుపు అలాగే ఉంటుంది.



## మీకు చాక్లెట్ అంటే ఇష్టం లేదా?

### అయితే.. మీరు ఏం మిస్ అవుతున్నారో తెలిస్తే షాకవుతారు

చాక్లెట్స్ అంటే ఇష్టంలేనివారు ఎవరుంటారు చెప్పండి. తియ్యగా, క్రిమీగా ఉండే చాక్లెట్ను అలా నోటిలో పెట్టుకోగానే కరిగిపోతుంది. మనసు ఆనందాన్ని కూడా ఇస్తుంది. అయితే, ఇప్పటికే చాలా అధ్యయనాలు చాక్లెట్లు తినడం ఆరోగ్యానికి మంచిదేనని స్పష్టం చేశాయి. చాక్లెట్ హార్ట్కు కూడా మేలు చేస్తుందని పరిశోధకులు చెప్పారు. తాజా అధ్యయనంలో మరో ఆసక్తికర విషయం వెలుగు చూసింది. అది తెలిస్తే ఎగిరి గంతేస్తారేమో, అదేంటో చూసేయండి.

### చిగుళ్లకు మంచిదే


చాక్లెట్లు తినడం వల్ల మీ దంతాల చిగుళ్లకు కూడా మేలు జరుగుతుందటే నమ్ముతారా? సాధారణంగా చాక్లెట్లు ఎక్కువగా తింటే పళ్లు పుచ్చుపోతాయని అంటారు. కానీ, తాజా అధ్యయనం మాత్రం చాక్లెట్లు తినడం వల్ల చిగుళ్ల వ్యాధి వచ్చే అవకాశాలు తగ్గుతాయని పేర్కొంది. ఔనండి, మీరు విన్నది కరక్టే. ముఖ్యంగా డార్క్ చాక్లెట్ తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయట. డార్క్ చాక్లెట్లో ఉండే కోకోబీన్స్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు చిగుళ్లకు మేలు చేయవచ్చని పేర్కొన్నారు. సుమారు 50 శాతం వరకు చాక్లెట్లు చిగుళ్లకు మేలు చేయొచ్చని చెప్పారు. అయితే, సుగర్ కంటెంట్ ఎక్కువగా ఉండే చాక్లెట్లు తింటే మాత్రం మొదటికి మోసం వస్తుంది. అవి దంతాలను తినేస్తాయి. దంతక్షయం ఏర్పడి.. భవిష్యత్తులో చాక్లెట్లను చూస్తేనే భయపడే పరిస్థితి నెలకొంటుంది. కాబట్టి, చాక్లెట్లు మంచివే కదా అని అదే పనిగా తినొద్దు. ఒక వేళ తినాలి అనిపిస్తే.. డార్క్ చాక్లెట్లు తినండి.

### చిగుళ్లకు ఏవీ మేలు? ఏవి మంచివి కాదు?

అధిక సుగర్ లేదా సాల్ట్ కంటెంట్ ఉన్న ఆహారాలేవీ చిగుళ్ల ఆరోగ్యానికి మంచివి కాదు. చీజ్ చిగుళ్లకు మంచిదే. అలాగే తక్కువ ఉప్పు కలిపిన వేరే శనగలు కూడా మేలు చేస్తాయి. ఉడకబెట్టిన లేదా వేపిన శనగలైతే బెస్ట్. ఫిల్టర్ కాఫీలు, తక్కువ క్యాలరీలు కలిగిన ఆహారాలు చిగుళ్లకు మంచివి కాదు. చెక్లెట్, చీజ్ 54 శాతం వరకు చిగుళ్లకు మేలు కలిగిస్తాయి. వేరు శనగలై 71 శాతం వరకు మంచివి. మనం డైలీ తినే రైస్ వల్ల కూడా చిగుళ్లకు ఎలాంటి ప్రమాదం ఉండదు. కనీసం 58 శాతం వరకు మేలు జరుగుతుంది. ఫిల్టర్ కాఫీ వల్ల 42 శాతం, తక్కువ క్యాలరీలు కలిగిన పానీయాల వల్ల చిగుళ్లకు 57 శాతం వరకు నష్టం కలగవచ్చని చైనాలోని చాంగ్కింగ్ మెడికల్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. కాబట్టి.. పై వాటిలో మీ చిగుళ్లకు మేలు చేసే ఆహారాన్నే ఇకపై ఎంచుకోండి.

ఆ ఫాస్టింగ్‌తో 21 రోజులలో 13 కిలోలు తగ్గాడట.. నిజంగానే బరువు తగ్గుతారా? సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా?

**గమనిక:** పలు అధ్యయనాలు, పరిశోధనలు, హెల్త్ జర్నల్స్ నుంచి సేకరించిన సమాచారాన్ని మీ అవగాహన కోసం ఇక్కడ యథావిధిగా అందించాం. ఈ సమాచారం వైద్యానికి లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఆరోగ్యానికి సంబంధించి.. ఎలాంటి సందేహాలున్నా మీరు తప్పకుండా డాక్టర్ను సంప్రదించాలి. ఈ ఆర్టికల్లో పేర్కొన్న అంశాలకు 'ఏబీపీ దేశం', 'ఏబీపీ నెట్వర్క్' ఎటువంటి బాధ్యత వహించవని గమనించగలరు.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com